RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం


PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 03 ఏప్రిల్ 2026 శుక్రవారం పేజీలు:12 వెల రూ.2.00 సంపుటి:21 సంచిక:256

## అమరావతికి రాజ్యసభ ఆమోదముద్ర
## మద్దతు ప్రకటించిన బీఆర్ఎస్




న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన (సవరణ) బిల్లు-2026కు రాజ్యసభలో ఘనమైన ఆమోదం లభించింది. ఏపీ ఏకైక రాజధానిగా అమరావతిని చట్టబద్ధం చేస్తూ కేంద్రం ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై గురువారం ఎగువసభలో సుదీర్ఘ చర్చ జరిగింది. లోక్‌సభ ఇప్పటికే ఈ బిల్లును ఆమోదించగా, నేడు రాజ్యసభ కూడా పచ్చజెండా ఊపడంతో అమరావతికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించే దిశగా మరో కీలక అడుగు పడింది. పదకొండు రాజకీయ పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు ఈ చర్చలో పాల్గొని ఏపీ రాజధానిగా అమరావతికి తమ మద్దతు ప్రకటించారు.ఈ చర్చలో అనూహ్య రీతిలో ప్రాంతీయ, జాతీయ పార్టీలన్నీ ఏకగ్రీవంగా అమరావతికి మద్దతు పలికాయి. కాంగ్రెస్, బీజేపీ, టీడీపి, జనసేన వంటి పార్టీలతో పాటు తెలంగాణ నుంచి భారత్ రాష్ట్ర సమితి కూడా ఈ బిల్లును సమర్థించింది.

మిగతా 2లో

## నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు:
## తెలంగాణ బీజేపీ ఎంపీ




దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబునాయుడు కృషి చేశారని, విభజన తర్వాత ఏపీకి అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారని తెలంగాణ బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరమని ఆయన అన్నారు. రాజధాని అమరావతి కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తు చేశారు. భవ్య రాజధాని కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం అవశ్యమన్నారు. రాజధాని అవసరమని, కానీ జగన్ తన హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు.

రాజధాని కోసం చాలాకాలంగా పోరాడిన మహిళలకు, రైతులకు ఆయన శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. అమరావతి బిల్లు కోసం దేశం మొత్తం ఆసక్తిగా చూస్తోందని అన్నారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని నాడు పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్రం ఇచ్చిందని అన్నారు.

## అమెరికా లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుంది:
## ట్రంప్ వ్యాఖ్యలపై ధీటుగా స్పందించిన ఇరాన్

అమెరికా తమకు లొంగిపోయేవరకు ఈ యుద్ధం కొనసాగుతుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయని, వారి నాయకత్వాన్ని తీవ్రస్థాయిలో దెబ్బతీశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ధీటుగా స్పందించింది. ట్రంప్ చెప్పినట్లుగా తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని పేర్కొంది. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి ప్రకటన చేయగా, ఇరాన్ అధికారిక మీడియా ప్రసారం చేసింది. తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తి సమాచారం లేదని పేర్కొంది.

వ్యూహాత్మక క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతో పాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామని ట్రంప్ చేసిన వాదనలను ఇరాన్ ఖండించింది. అమెరికా రాతి యుగం నాటి నేరాలను ఆధునిక యుగానికి తీసుకువస్తోందని ఆరోపించింది. చిన్నారుల హత్యలు, మానవత్వానికి మచ్చతెచ్చే నేరాలకు పాల్పడుతోందని ఆరోపించింది.

## 2వదశలో 45రోజుల తర్వాత జిల్లాకో
## మండలంలో సమీకృత భూభారతి

ప్రతి జిల్లాలోని 70 గ్రామాల్లో పూర్తిస్థాయి సర్వే
ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్
వీలైనంత త్వరగా సాదాబైనామాలకు పరిష్కారం
ఎన్నికల్లో ఫలితాలు చూసినా జ్ఞానోదయం కలగలేదు
అసెంబ్లీలో టెర్రరిస్టుల్లా ప్రవర్తించారు
మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.

హైదరాబాద్ :- రాష్ట్రంలో ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను 45రోజుల పాటు పరిశీలించి తర్వాత అవసరమైన మార్పులు, చేర్పులతో జిల్లాకొక మండలంలో ప్రవేశపెడతామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు.

మిగతా 2లో




## గ్యారంటీలపై సందేహాలుంటే
## తెలంగాణకు రండి: సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్ సీఎం మాట్లాడుతూ అవినీతి.. కుటుంబ పాలనలో ఒకేలా కేసీఆర్..విజయన్ కుటుంబాలు. కేంద్ర నిధులు మోదీ కరుణ కాదు ప్రజల హక్కుయూడీఎఫ్ మేనిఫెస్టో విడుదలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.కొచ్చి యూడీఎఫ్ ప్రకటించిన గ్యారంటీలపై విమర్శలు చేస్తున్న వారు అవి ఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అమలవుతున్న పథకాలను ప్రత్యక్షంగా చూసి..తమ ట్రాక్ రికార్డు పరిశీలించుకోవచ్చని ఆయన సూచించారు. కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్, ఆయన మంత్రులు తెలంగాణకు వస్తే తాము గ్యారంటీలు ఎలా అమలు చేస్తున్నామో ప్రత్యక్షంగా చూపుతామని సీఎం తెలిపారు. కేరళం శాసనసభ ఎన్నికలకు సంబంధించి యూడీఎఫ్ మేనిఫెస్టోను కొచ్చిలో గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేరళంలో పినరాయి విజయన్ హయాం ముగిసిందని, ఇక యూడీఎఫ్ స్వర్ణయుగం మొదలవుతుందన్నారు. మోదీ బ్రదర్స్..పినరాయి కేసీఆర్‌ల మధ్య పోలికలుముఖ్యమంత్రి పినరాయి విజయన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశాన్ని, కేరళంనూ మోదీ బ్రదర్స్ పాలిస్తున్నారని మోదీ.. విజయన్‌ను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. దేవుడి స్వంత రాష్ట్రంలో దేవుడి ఆస్తికీ రక్షణ లేదంటూ పరోక్షంగా శబరిమల బంగారం ఉదంతాన్ని సీఎం లేవనెత్తారు. కేరళంలో గత పదేళ్లుగా పినరాయి విజయన్ ప్రభుత్వం కొనసాగుతోందని, అలాగే 2014 నుంచి సుమారు పదేళ్ల పాటు కేసీఆర్ తెలంగాణను పాలించారన్నారు. పినరాయి కుటుంబ పాలన, అవినీతి, అసమర్థ పాలన విషయంలో పినరాయి విజయన్, కేసీఆర్‌ల మధ్య అనేక పోలికలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. 2023లో తెలంగాణలో మాదిరి మార్పే ఈసారి కేరళంలో చోటుచేసుకుంటుందని సీఎం అన్నారు. పినరాయి విజయ్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపుతారని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. పో మోనే విజయా,వ్యాఖ్యపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... విజయన్ తమకు రాజకీయ ప్రత్యర్థి అని, మోదీలా మాట్లాడటం తనకు సాధ్యం కాదని, విమర్శించకుండా ఉండటం తన స్వభావం కాదని స్పష్టం చేశారు. అవినీతి నియంత్రణ, ఆదాయానికి గండిపెట్టే అంశాలను నియంత్రించడం, కేంద్ర పథకాల గరిష్ట వినియోగం, రాష్ట్రానికి రావలసిన నిధుల సాధన.. తమ ప్రాధాన్య అంశాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కరుణ కాదని.. అది ప్రజల హక్కు అనే విషయం ప్రజలకు తెలియజేస్తామని సీఎం తెలిపారు. యూడీఎఫ్ కార్మికుల కూటమి అని, కూటమిలో నిజాయితీగల నాయకులు ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు. తొలి క్యాబినెట్ నుంచే హామీల అమలు..కేరళంలో యూడీఎఫ్ గ్యారంటీలు అమలు సాధ్యమా అని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని..దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.21 వేల కోట్ల రుణాలను తాము మాఫీ చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని సీఎం తెలిపారు. 67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని సీఎం వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, 10 వేల బస్సులు, 50 వేల సిబ్బందితో ఉన్న ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామని సీఎం తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా అవుతోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మహిళలను బస్సుల యజమానులుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ -2047 ప్రకారం తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ వృద్ధిరేటు 10.8 శాతంగా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్యమని తాము నిరూపించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కేపీసీసీ ప్రెసిడెంట్ సన్నీ జోసెఫ్, కేరళ సీఎల్పీ నేత వి.డి.సతీషన్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీప్ దాస్ మున్షీ, యూడీఎఫ్ కన్వీనర్ ఆదూర్ ప్రకాష్, ఐయూఎంఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.కె.కున్హాలికుట్టి తదితరులు పాల్గొన్నారు.కేరళం లో ఇందిరా ఐదు గ్యారంటీలు:కేరళం శాసనసభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోలోని ఇందిరా ఐదు గ్యారంటీలు: కేరళ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కేఎస్ఆర్టీసీ, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం.కాలేజీ చదువుతున్న బాలికలకు నెలకు రూ.1,000 ఆర్థిక సహాయం.సంక్షేమ పింఛన్లు నెలకు రూ.3 వేలకు పెంపు. మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాండీ పేరుతో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా.యువతకు స్వయం ఉపాధి కోసం రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు.ఐదు గ్యారంటీలతో పాటు సముద్ర, విమానయాన రంగాలకు సంబంధించి ఐదు డ్రీమ్ ప్రాజెక్టులు, వయనాడ్‌లో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు వాగ్దానాలు ఉన్నాయి.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను
## సద్వినియోగం చేసుకోవాలి

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం.
గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన
మంత్రి దామోదర్ రాజనర్సింహ.



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 02 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉండి, పేదల అభ్యున్నతే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు,"ప్రజా పాలన - ప్రగతి" ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా గురువారంఆందోల్,మంలం అల్మాయిపేట, గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు, గ్రామసభ తెలంగాణ గీతంతో ప్రారంభమైంది అనంతరం రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని గ్రామ ప్రజలకు చదివి వినిపించారు వివిధ శాఖల అధికారులు, గ్రామాల్లో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల లబ్ధిదారుల వివరాలను వివరించారు

మిగతా 2లో

ప్రజాబలం

03 ఏప్రిల్ 2026 శుక్రవారం

# ఆమె ఆస్తి ఆమె ఇష్టం

ఆధునిక సమాజంలో మహిళా సాధికారతకు అసలైన అర్థం ఆమె ఆర్థిక స్వాతంత్ర్యం. భారతీయ సమాజంలో వివాహం అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల కలయిక మాత్రమే కాదు, రెండు కుటుంబాల ఆర్థిక ప్రయాణం కూడా. నేటి ఆధునిక కాలంలో చాలా వరకు భార్యాభర్తలిద్దరూ సంపాదిస్తున్నారు. ఉమ్మడి లక్ష్యాల కోసం కలిసి ఆస్తులు కొంటున్నారు. అయితే, దురదృష్టవశాత్తూ ఆ బంధం విడాకుల వరకు వెళ్తే.. మరి వారు ఇద్దరూ కలిసి కొనుగోలు చేసిన ఆస్తి ఎవరిది? అనే ప్రశ్న వివాదంగా మారుతోంది. ఇటీవల '1 ఫైనాన్స్' నిర్వహించిన అధ్యయనం ప్రకారం, విడాకులు తీసుకున్న వారిలో 67 శాతం మంది తాము విడిపోకముందే తీవ్రమైన ఆర్థిక విభేదాలు ఎదుర్కొన్నట్లు తేలింది. అంతేకాకుండా, 43 శాతం కేసుల్లో విడాకులకు ప్రధాన కారణం ఆర్థిక సమస్యలే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో వైవాహిక ఆస్తుల యాజమాన్యంపై చట్టం ఏం చెబుతోంది? ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన కీలక తీర్పు ప్రాధాన్యత ఏమిటి? అనే అంశాలను చూద్దాం. టైటిల్ డీడ్ వర్సెస్ కంట్రిబ్యూషన్: చట్టం ఏం చెబుతోంది? 1955 హిందూ వివాహ చట్టం ప్రకారం, ఆస్తి ఎవరి పేరు మీద ఉంటే వారే యజమాని అనేది ప్రాథమిక సూత్రం. కేవలం పెళ్లి చేసుకున్నంత మాత్రాన భర్త ఆస్తిలో భార్యకు లేదా భార్య ఆస్తిలో భర్తకు సగం వాటా దానంతట అదే రాదు. ఇటీవల అమిష్ అగర్వాలా కేసులో తెలంగాణ హైకోర్టు ఒక స్పష్టమైన తీర్పునిచ్చింది. భర్త పేరు మీద ఉన్న నివాస ఆస్తిలో తనకూ వాటా కావాలని భార్య కోరగా కోర్టు దాన్ని తోసిపుచ్చింది. 'వివాహం జరిగినంత మాత్రాన స్థిరాస్తిపై ఉమ్మడి యాజమాన్యం ఏర్పడదు' అని కోర్టు స్పష్టం చేసింది. ఆస్తి కొనుగోలులో తమ ఆర్థిక భాగస్వామ్యం ఉందనడానికి బ్యాంకు స్టేట్‌మెంట్లు వంటి పక్కా ఆధారాలు చూపాలని న్యాయస్థానం పేర్కొంది. వినీతా సక్సేనా కేసు మినహాయింపు. సుప్రీంకోర్టు కొన్ని సందర్భాల్లో దీనిపై విభిన్నంగా స్పందించింది. వినీతా సక్సేనా వర్సెస్ పంకజ్ పండిట్ (2006) కేసులో ఆస్తి భర్త పేరు మీద ఉన్నప్పటికీ భార్యకు అనుకూలంగా తీర్పు వచ్చింది. గృహిణిగా ఆమె అందించిన సేవలు, ఇంటి నిర్వహణలో ఆమె పడిన శ్రమను 'పరోక్ష సహకారం'గా గుర్తించి హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 27 కింద ఆమెకు హక్కు కల్పించింది. నేటికీ చాలామందిలో ఆస్తి విషయంలో కొన్ని తప్పుడు అవగాహనలు ఉన్నాయి. 1 ఫైనాన్స్‌లో విల్, ఎస్టేట్ ప్లానింగ్ హెడ్ శ్రద్ధా నీలేశ్వర్ కొన్ని కీలక విషయాలను వివరించారు. తాను తెలిపిన వివరాలు కింది విధంగా ఉన్నాయి. పెళ్లయ్యాక కొన్న ఆస్తిలో భాగస్వామికి ఆటోమేటిక్‌గా 50% వాటా రాదు. 'షమీమా ఫరూకీ వర్సెస్ షాహిద్ ఖాన్ (2015)' కేసు ప్రకారం, ఆస్తిలో నివసించే హక్కు మాత్రమే ఉంటుంది తప్ప, పూర్తి యాజమాన్య హక్కులు ఉండవు. చాలామంది పన్ను ఆదా కోసం ఒకరి పేరు మీదనే ఆస్తులు కొంటారు, కానీ విడాకుల సమయంలో ఇది రెండో వ్యక్తికి చట్టపరమైన ఇబ్బందులు కలిగిస్తోంది. ప్రస్తుతం 42 శాతం మంది పురుషులు తమ సంపాదనలో సగటున 38 శాతాన్ని భరణం లేదా వివాహ సంబంధిత రుణాలకే వెచ్చిస్తున్నారు. ఇది ఆర్థిక ప్రణాళికలో రికార్డుల ప్రాధాన్యతను చెబుతోంది. నిపుణుల సూచనలు. భవిష్యత్తులో ఆస్తి తగాదాలు తప్పించుకోవడానికి కొనుగోలు సమయంలోనే భార్యాభర్తలిద్దరి పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించాలి. దీనివల్ల సెక్షన్ 80సీ, సెక్షన్ 24(ఎ) కింద ఇద్దరూ పన్ను మినహాయింపు పొందవచ్చు. డౌన్ పేమెంట్స్ లేదా ఈఎంఐలు చెల్లించినప్పుడు ఆ లావాదేవీల రికార్డులను, బ్యాంక్ స్టేట్‌మెంట్లను భద్రపరుచుకోవాలి. ఆస్తిలో ఎవరి వాటా ఎంతో దస్తావేజుల్లోనే పేర్కొనడం ఉత్తమం. వివాహం అనేది నమ్మకంతో కూడిన బంధం అయినప్పటికీ, ఆర్థిక విషయాల్లో పారదర్శకత ఉండటం నేటి కాలంలో అత్యవసరం. చట్టపరమైన చిక్కులు రాకముందే మేల్కొని ఆస్తులకు సంబంధించిన సరైన పత్రాలను సిద్ధం చేసుకోవడం ఇరు పక్షాలకు శ్రేయస్కరం. తాజాగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వెలువరించిన ఒక తీర్పు ఈ విషయాన్ని మరోసారి ఘంటాపథంగా నొక్కి చెప్పింది. "భార్యకు పుట్టింటి నుండి వచ్చిన ఆస్తిపై భర్తకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కు ఉండదు" అని స్పష్టం చేస్తూ, మహిళల ఆత్మగౌరవానికి మరియు ఆస్తి హక్కులకు న్యాయస్థానం ఒక గట్టి రక్షణ కవచాన్ని నిర్మించింది.ఈ కేసులో హైకోర్టు ధర్మాసనం అత్యంత కీలకమైన అంశాలను ప్రస్తావించింది. మహిళలు తమ పుట్టింటి (తల్లిదండ్రుల) నుండి వారసత్వంగా పొందిన ఆస్తిపై పూర్తి నియంత్రణ కలిగి ఉంటారని తేల్చి చెప్పింది.ఆ ఆస్తిని ఎవరికి ఇవ్వాలి? ఎప్పుడు అమ్మాలి? ఎవరికి బహుమతిగా ఇవ్వాలి? అనే నిర్ణయం కేవలం ఆ మహిళదే. ఈ ప్రక్రియలో భర్త అనుమతి గానీ, సమ్మతి గానీ అవసరం లేదు. వివాహం జరిగినంత మాత్రాన భార్య ఆస్తిపై భర్తకు సహజసిద్ధమైన హక్కులు లభించవు. హిందూ వారసత్వ సవరణ చట్టంలోని సెక్షన్ 15(2)(జీ) ప్రకారం, ఒక మహిళకు ఆమె పుట్టింటి నుండి వచ్చిన ఆస్తి, ఆమెకు సంతానం లేని పక్షంలో తిరిగి ఆమె తండ్రి వంశానికే చెందాలి తప్ప అత్తగారింటికి కాదు.ఈ వివాదం ఒక ఆసక్తికరమైన మలుపు నుండి మొదలైంది. ఒక మహిళ తనకు తన తల్లిదండ్రుల నుండి వచ్చిన ఆస్తిని తన మనవరాలికి ఇష్టపూర్వకంగా రాసిచ్చింది. అయితే, "భార్య ఆస్తిలో భర్తగా నాకు వాటా ఉండాలి" అంటూ ఆమె భర్త కోర్టు మెట్లు ఎక్కారు. భార్య ఆస్తిపై భర్తకు హక్కు ఉంటుందనే పాతకాలపు ఆలోచనా ధోరణిని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఆస్తి ఏ మూలాల నుండి వచ్చిందో, ఆ వంశ గౌరవాన్ని కాపాడటమే చట్టం ఉద్దేశమని కోర్టు స్పష్టం చేసిందిఈ తీర్పు కేవలం ఒక చట్టపరమైన నిర్ణయం మాత్రమే కాదు, ఇది మహిళల 'ఆర్థిక సార్వభౌమాధికారం' పై వేసిన ముద్ర."మహిళ కేవలం ఇంటిని నడిపే గృహిణి మాత్రమే కాదు.. తన ఆస్తిని పాలించే రాణి కూడా!" పుట్టింటి ఆస్తిని భర్త పేరు మీద మార్చాలని ఒత్తిడి చేసే వారికి ఈ తీర్పు ఒక హెచ్చరిక. ఆర్థికంగా మహిళ బలంగా ఉన్నప్పుడే సమాజంలో ఆమెకు నిజమైన గౌరవం లభిస్తుంది. ఈ తీర్పు ఆ నమ్మకాన్ని రెట్టింపు చేసింది. అత్తగారింటి వేధింపులకు, బలవంతపు ఆస్తి బదిలీలకు ఈ తీర్పు ఒక శాశ్వత పరిష్కారంగా నిలవనుంది.ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఈ ప్రగతిశీల తీర్పు న్యాయ చరిత్రలో ఒక మైలురాయి. మహిళల హక్కులను కాలరాసే ఏ శక్తినైనా చట్టం సహించదని ఈ తీర్పు నిరూపించింది. ఇది ఉమెన్ పవర్ కు దక్కిన అసలైన విజయం! ఇకపై మహిళా వారసత్వ ఆస్తి విషయంలో ఆమె మాటే శాసనం.. ఆమె నిర్ణయమే అంతిమం!





హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి హైదరాబాద్ లోని చిక్కడపల్లి హనుమాన్ దేవాలయం లో హనుమాన్ జయంతి సందర్భంగా సతీసమేతంగా ఆంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దంపతులు...
ఈ కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, యువజన కాంగ్రెస్ నాయకులు అరవింద్ కుమార్, చైర్మన్ జానకి సుధాకర్, ఆలయ అధికారులు, పాలకవర్గం పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు కు ముందుకు వస్తే రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, నీటి ట్యాంక్, విద్యుత్



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు, మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రతి గ్రామంలో మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు 30, రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలనిసూచించారు.గ్రామంలోని 28 స్వయం సహాయక సంఘాలకు రూ.3.50 కోట్ల రుణాలు అందించగా, రూ.2.50, లక్షల వడ్డీ సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు, ఇందిరమ్మ ఇళ్లు, వడ్డీ లేని రుణాలు, భీమా పథకాలు, రైతు భరోసా, రైతు భీమా, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లుచెప్పారు, అల్మాయి పేట, గ్రామంలోని సర్వే నం. 513లో కొత్త కాలనీ సౌకర్యాలు, ఇళ్ల నిర్మాణం, వంటి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని, మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు,గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, పేర్కొంటూ, హైవే నుండి అల్మాయిపేట-- కొన్యాల వరకు బీటీ రహదారి, అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలకు మంజూరు చేస్తామని తెలిపారు.

మంజూరైన 7,ఇందిరమ్మ ఇళ్లలో 4,మాత్రమే నిర్మించబడిన నేపథ్యంలో మిగిలిన లబ్ధిదారులు, కూడా వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని, సూచించారు.

అవసరమైన ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, వ్యక్తిగతంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు ఇల్లు, నిర్మించేందుకు ముందుకు వచ్చే వారికి కొత్తగా ఇళ్ల మంజూరు కూడా చేస్తామని



తెలిపారు,ప్రాంతంలో ఉన్నత విద్యాసంస్థలు ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని కోరారు. ఆందోల్ నియోజకవర్గంలో త్వరలో ఫార్మసీ కళాశాల స్థాపన జరుగుతుందని, సంగుపేట,గుట్ట వద్ద రెండు మూడు పరిశ్రమలు రానున్నట్లువెల్లడించారు. పేదలకు చెందిన సుమారు 40,ఎకరాల అసైన్డ్ భూమి తప్పుగా రిజిస్ట్రేషన్, అయిన విషయంపై ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేసి, రిజిస్ట్రేషన్ రద్దు చేసి భూములను అసలు లబ్ధిదారులకు తిరిగి ఇవ్వాలని సూచించారుప్రభుత్వం చేపట్టిన పథకాలు, అర్హులందరికీ చేరేలా చూడాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను, నిలబెట్టుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని,మంత్రి స్పష్టం చేశారు,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, మాట్లాడుతూ,ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వచ్చే రెండు నెలల్లో 10 శాఖల ద్వారా చేపట్టే కార్యక్రమాలలో ప్రజలు చురుకుగా పాల్గొనాలని కోరారు,ఇందిరా మహిళా శక్తి పథకం కింద రూ.800 కోట్లను అందజేసి, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని, నాలుగు లక్షల ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడంతో పాటు, 50, వేల కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు, పలు అభివృద్ధి, సంక్షేమ,కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు,కొత్తగా పిల్లలకు పోషకాహారంతో కూడిన రాగి జావాతో బ్రేక్‌ఫాస్ట్ పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు,మధ్యాహ్న భోజన పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకాలను,ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్నట్లు తెలిపారు,ప్రభుత్వ పథకాలు, అర్హులందరికీ చేరేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు,అనంతరం ముగ్గురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల,గృహ నిర్మాణాలకు మంత్రి, కలెక్టర్ కలిసి,కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు,ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, సర్పంచ్, ఉప సర్పంచ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 2వదశలో 45రోజుల తర్వాత జిల్లాకో మండలంలో సమీకృత భూభారతి

మొదటి పేజీ తరువాయి

గురువారం నాడు రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలోని మితాయిపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను మంత్రి పొంగులేటి లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఈరోజున ఈ అమనగల్ మండలంతోపాటు ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట,సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి,నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఏ పేదోడు ఏ ఆఫీసు చుట్టూ చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు ఏ అధికారి దగ్గరికి వెళ్లి ప్రాధేయపడవలసిన అవసరం లేదు తన చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్ తో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ లో లాగిన్ అయితే అన్ని సేవలు లభిస్తాయని అన్నారు.

గత ప్రభుత్వ పాలకులు ప్రవేశపెట్టిన ధరణి కారణంగా రాష్ట్రంలో 9.52 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు దిక్కులేకుండా పోయిందని ఇప్పుడు ఈ పేదల ప్రభుత్వం దీనిపై దృష్టి సారించిందని తెలిపారు. సాగుచేస్తూ, వారి అధీనంలో ఉండే భూములకు సంబంధించి సదరు వ్యక్తి వద్ద కన్సెంట్ తీసుకొని వారికే భూమి పట్టాను ఖరారు చేస్తామని దీనికోసం వారం రోజుల క్రితం భూభారతిలో సవరణ చేస్తూ జీవో జారీ చేశామని వెల్లడించారు. అంతేగాక గతంలో గ్రామంగా ఉండి ఇప్పుడు మున్సిపాల్టీగా మారిన ప్రాంతాలకు ఈ సాదాబైనామాలు వర్తించేలా చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు.

ప్రజల కోసం తమ రెవెన్యూశాఖలో గణనీయమైన మార్పులు తెస్తున్నామని దీనిలో? భాగంగా అక్రమాల ధరణిని చెప్పినట్లే బంగాళాఖాతంలో కలిపి భూభారతి తెచ్చామని, ఆధార్ నెంబర్‌లా ప్రతి భూమికి భూధార్ నెంబర్‌ను కేటాయిస్తామని చెప్పారు. అంతేగాక రాష్ట్రంలో10.984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జీపీవోలను నియమించడం జరిగింది. 5300 మందికి రెండు విడతల్లో ఆరునెలల పాటు శిక్షణ ఇచ్చి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించామని తెలిపారు. సర్వే విషయంలో కూడా పాత పద్ధతులకు స్వస్తి పలికి ఇప్పటికే 411 రోవర్లతో కచ్చితమైన సర్వే చేయిస్తున్నామని, త్వరలో మరో 400 రోవర్లు రాబోతున్నాయని తెలిపారు.

టెర్రరిస్టుల్లా ప్రవర్తించారు

పేదల సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వ పనిచేస్తుంటే గత ప్రభుత్వంలో అరాచకాలకు పాల్పడిన వ్యక్తులు ఇప్పుడు శాసనసభ సాక్షిగా విషం కక్కారని, టెర్రరిస్టుల్లా ప్రవర్తించారని మంత్రి పొంగులేటి ధ్వజమెత్తారు. ప్రతి ఎన్నికల్లో ఓడిపోయిన వారికి ఇంకా జ్ఞానోదయం కాలేదని అన్నారు.

ఈ సందర్భంగా ఈ నియోజకవర్గ పరిధిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయ భవనాలకు త్వరలో తాను శంకుస్థాపన చేస్తానని మంత్రి పొంగులేటి ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి లోకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గౌలిగూడలో శోభాయాత్ర





హైదరాబాద్ హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా హైదరాబాద్ గౌలిగూడ రామ్ మందిర్ నుంచి ప్రారంభమైన శోభాయాత్రలో వేలాది భక్తులు పాల్గొన్నారు. బైక్ ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన భక్తులు , పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్త్ ఏర్పాటు చేశారు. యాత్ర మార్గం పొడవునా స్వాగత స్టేజీలు ఏర్పాటు చేసి, మజ్జిగ, నీరు, టిఫిన్స్, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## రాజన్న టీమ్ ఆధ్వర్యంలో చెట్లు నాటిన డీసీ చాముండేశ్వరి.



**కూకట్పల్లి (ప్రజాబలం ) ఏప్రిల్ 02:**ఎల్లమ్మ బండ వాటర్ రిజర్వాయర్ వద్ద రాజన్న టీమ్ ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి చెట్లు నాటడం జరిగింది. ప్రగతికి మెట్లు పచ్చని చెట్లు అని చెట్లను కాపాడుకోవడం వల్ల అవి మనల్ని మన ఆరోగ్యాన్ని పరిసరాలను కాపాడతాయని నాటిన చెట్లను తొలగించకుండా జాగ్రత్త పడాలని డిసి చాముండేశ్వరి అన్నారు. ఇట్టి వాటర్ ట్యాంక్ వద్ద అసాంఘిక కార్యకలాపాలు ఆకతాయిలు తరచూ స్థానికులను ఇబ్బంది పెడుతున్న విషయాన్ని రాజన్న టీమ్ సభ్యుడు బుల్లెట్ రవి డిసి దృష్టికి తీసుకెళ్లగా అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు మరియు చెట్లు నాటడం వంటి కార్యక్రమాలు చేయబోతున్నామని రాజన్న టీమ్ వివరించడంతో చెట్లు నాటడం జరిగిందని స్థానిక సమస్యల మీద అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్న రాజన్న టీమ్ సభ్యుడు బుల్లెట్ రవిని డిసి ప్రశంసించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుడ్ల శ్రీనివాస్, మల్లేష్, బాబు, రాజు, అరుణ్, ఉప్పల రాజు, హరీష్, శివ, లింగన్న, సుమన్ పలువురు పాల్గొన్నారు.

## భుచన్ పల్లి గ్రామ సభ సర్పంచ్ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో సమావేశంలో పాల్గొన్నఏపీవో అంజిరెడ్డి



**వికారాబాద్,నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 2 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం భూచన్ పల్లి గ్రామ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ వెంకటరామిరెడ్డి తెలిపారు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ గ్రామసభలు ముందుకు తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు తెలంగాణ గీతం పాడి తదుపరి గా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం 500 కి గ్యాస్ సిలిండర్ ఉచిత కరెంటు ఆరోగ్య శ్రీ పేదల పెన్నిధి పెంచడం గురించి ఇందిరమ్మ ఇళ్ల గురించి షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి రైతుబంధు మహిళ సమైక్య భవనాలు ఇలా ఒక్కొక్కటిగా అన్ని కార్యక్రమాలువెను వెంటనే ఒక్కొక్కటిగాజరుగుతాయని ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎప్పటికప్పుడు అందేలా ప్రభుత్వ అధికారులు కృషి చేస్తూ ఉంటారని మర్పల్లి ఏపీఓ అంజిరెడ్డి తెలిపారు గ్రామసభ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ ఏపీ ఓ అంజిరెడ్డి,ఉప సర్పంచ్, పాలకవర్గ సేవకులు సభ్యులు, గ్రామ సెక్రెటరీ,స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న సభ్య లు అంగన్వాడి టీచర్లు ఆశ వర్కర్లు ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామ పెద్దలు యువకులు మహిళా సోదరులు గ్రామ సభలో పాల్గొని సభను విజయవంతం చేశారని తెలిపారు

## ఇరిగేషన్ శాఖ ముఖ్య అధికారి వెంకటేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసిన కలిసిన బజ్జూరి రమణారెడ్డి



**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 2 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా ఇరిగేషన్ శాఖ ముఖ్య అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టిన మంగళంపూడి వెంకటేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలసిన జిల్లా టీఎన్జీవో ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెయింటినెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు. ఈ సందర్భంగా జిల్లా నాయకులతో తన అనుభవాలను భవిష్యత్తులో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు మెలకువల గురించి సిబ్బందికి క్షుణ్ణంగా సవివరంగా తెలియజేయడం జరిగినది అదేవిధంగా సిబ్బంది ఎదుర్కొంటున్న ఎలాంటి పెండింగ్ పనులు ఉన్న తన ఆఫీసులోనే కాకుండా ఇంటి తలుపు తట్టిన చేయటానికి సిద్ధంగా ఉన్నట్టు జిల్లా నాయకుల ముందే వారి హర్షద్వానాల మధ్య ప్రకటించిన నూతన చీఫ్ ఇంజనీర్ మంగళ పుడి వెంకటేశ్వర కి అభినందనలు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెయింటెనెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బజ్జూరి రమణారెడ్డి,ప్రధాన కార్యదర్శి సోమపొంగు శ్రీనివాస్, కోశాధికారి ఈశ్వర్, అసోసియేట్ ప్రెసిడెంట్ సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాటి మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి వాసు దేవరాజు, సటు వెంకటేశ్వర్లు, మెహబూబా సహాయ కార్యదర్శి నరసింహారావు, అర్జున్, ఆఫీస్ ఇంచార్జ్ సూరిబాబు ,జిల్లా నాయకులు నరసింహ, గురుస్వామి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు

## హనుమంతునికి 108 రకాల నైవేద్యలు సమర్పించిన.. మాజీ జెడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి దంపతులు



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఎప్రిల్ 02 :** హనుమాన్ జయంతి సందర్భంగా దండేపల్లి మండలం లోని కోతమమిదిపల్లి గ్రామం లో జయంతి వేడుకలు ఘనంగా జరిపినారు.మాజీ జెడ్పీటీసీ సభ్యులు గడ్డం నాగరాణి త్రిమూర్తి దంపతులు స్వామి వారికి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమార్చన మరియు హనుమాన్ దీక్ష



స్వాములు హనుమాన్ చాలీసా పారాయణము చేసినారు. బజన,సాంస్కృతిక,కార్యక్రమాలతో పాటు మహిళ స్వాములు కోలాట ఆటలు చిన్నారుల నృత్యాలతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు. గ్రామ నాయకులు,భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ .





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 02 (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బహుజన చక్రవర్తి శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి 316వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి ఆశయాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలనుఅధికారికంగా,నిర్వహిస్తున్నామన్నారు వారు తెలంగాణ ప్రాంతంలో అందించిన స్ఫూర్తి , త్యాగాన్ని భవిష్యత్ తరాలకు అందించే విధంగా వారు నిర్మించిన కోటలను పర్యాటకంగా, పురావస్తు కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అదనపు జిల్లా కలెక్టర్ మాధురి, అదనపు జిల్లా కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అమరావతికి రాజ్యసభ ఆమోదముద్ర మద్దతు ప్రకటించిన బీఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి

గత 12 ఏళ్లుగా కొనసాగుతున్న అనిశ్చితికి ఈ బిల్లు ముగింపు పలుకుతుందని ఎంపీలు పేర్కొన్నారు. అయితే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాత్రం బిల్లును తీవ్రంగా వ్యతిరేకించింది. మూడు రాజధానుల ప్రతిపాదనను ప్రస్తావిస్తూ, రాజధాని ప్రాంత రైతులకు ఇచ్చే పరిహారంపై స్పష్టత లేదని ఆరోపిస్తూ సభ నుంచి వాకౌట్ చేసింది.చర్చను ప్రారంభిస్తూ కాంగ్రెస్ నేత రేణుకా చౌదరి, ఏపీ రాజధాని విషయంపై ఇంతకాలం ఆలస్యం జరగడం పార్లమెంటు వైఫల్యమని, ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకున్నందుకు సంతోషమని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రసంగిస్తూ, ఇది కేవలం పరిపాలనాపరమైన నిర్ణయం కాదని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీక అని ఉద్వేగభరితంగా చెప్పారు. 2014 విభజన గాయాలను ఈ చట్టం మాన్పుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీలు తమ ప్రసంగాల్లో అమరావతిని బెంగళూరు, హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని కోరారు.తెలంగాణ ప్రాంత ప్రయోజనాలకు భంగం కలగకుండా, పొరుగు రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందడం తమకు ఇష్టమని బీఆర్ఎస్ ఎంపీలు స్పష్టం చేశారు. ఏపీకి ఒక శాశ్వత రాజధాని ఉండటం వల్ల తెలుగు రాష్ట్రాల మధ్య మరింత సహకారం పెరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు అన్ని ప్రధాన పార్టీలు అమరావతికే ఓటు వేయడంతో సభలో ఒక అరుదైన ఏకాభిప్రాయం కనిపించింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ చర్చకు సమాధానం ఇస్తూ, ఏపీ ప్రజల ఆకాంక్షలకు గౌరవం ఇస్తూనే ఈ చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. కేవలం వాయిస్ ఓట్ ద్వారా బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు ఛైర్మన్ ప్రకటించడంతో ఏపీలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంటులోని ఉభయ సభలు ఈ బిల్లును ఆమోదించినందున ఇది తదుపరి దశలో రాష్ట్రపతి ఆమోదం కోసం వెళ్తుంది. రాష్ట్రపతి సంతకం చేసిన వెంటనే ఇది చట్టంగా మారుతుంది. తదనంతరం కేంద్ర ప్రభుత్వం గెజెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. దీనివల్ల ఏపీ రాజధానిగా అమరావతికి రాజ్యాంగబద్ధమైన హోదా లభిస్తుంది. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం వచ్చినా ఈ చట్టాన్ని మార్చడం దాదాపు అసాధ్యమవుతుంది.

### రాజధాని బిల్లును వ్యతిరేకిస్తూ రాజ్యసభలోనూ వైసీపీ వాకౌట్

రాజ్యసభలో అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లుపై జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. రాజ్యసభలో అమరావతి బిల్లుపై మాట్లాడిన వైవీ సుబ్బారెడ్డి, ఈ మొత్తం వ్యవహారాన్ని ఒక పెద్ద డ్రామా గా అభివర్ణించారు. ప్రస్తుత రూపంలో ఉన్న అమరావతి బిల్లును తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. అసలు రాజధాని నిర్ణయం అనేది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని గతంలో కేంద్రమే అఫిడవిట్ దాఖలు చేసిందని గుర్తు చేస్తూ, మరి ఇప్పుడు కేంద్రం ఈ బిల్లును ఏ ప్రాతిపదికన ప్రవేశపెట్టిందని ఆయన ప్రశ్నించారు. కేంద్రానికి బిల్లు పెట్టే అధికారం లేదన్నారు. అమరావతి నిర్మాణం వల్ల రాష్ట్రంపై పడే ఆర్థిక భారాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. ఒక్కో ఎకరా అభివృద్ధికి రూ. 2 కోట్లు ఖర్చవుతుందని చెబుతున్నారని, మొత్తం ప్రాజెక్టుకు అవసరమైన రూ. 2 లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే వడ్డీల రూపంలోనే రూ. 20 వేల కోట్లు చెల్లించాల్సిన దుస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతిలో ప్రతి చదరపు అడుగుకు రూ. 12 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారని, దీని వెనుక పెద్ద ఎత్తున కుంభకోణాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసమే తమ ప్రభుత్వం గతంలో మూడు రాజధానుల నిర్ణయం తీసుకుందని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. అమరావతిని శాసన రాజధానిగా ఉంచుతూనే, విశాఖపట్నాన్ని ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా, కర్నూలును జ్యుడీషియల్ క్యాపిటల్‌గా చేయాలన్నదే తమ విధానమని చెప్పారు. అమరావతి ప్రాంతం వరదలతో మునిగిపోతుందని ఇప్పటికే ఆధారాలు ఉన్నాయని, అటువంటి ప్రాంతంలో వేల కోట్లు కుమ్మరించడం సరైన నిర్ణయం కాదని వాదించారు. అసెంబ్లీలో సరైన చర్చ జరపకుండానే తీర్మానం చేశారని సుబ్బారెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం కేవలం ఒక ప్రాంతానికే పరిమితమై మిగిలిన ప్రాంతాలను విస్మరిస్తోందని విమర్శించారు. తన ప్రసంగం అనంతరం, బిల్లుకు నిరసనగా వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు.

## అగ్రహారం జోడాంజనేయ స్వామిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ 2( ప్రజాబలం ప్రతినిధి)**వేములవాడ మండలం అగ్రహారం లోని శ్రీ జోడాంజనేయ స్వామి దేవస్థానాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ దర్శించుకున్నారు. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాన్ని దర్శించుకునేందుకు జిల్లా కలెక్టర్ విచ్చేయగా ఆలయ ఇంచార్జి ఈఓ వెంకన్న, అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఇమేజ్ ను డ్యామేజ్ చేస్తున్న మావిగన్...

విజయవాడ, ఏప్రిల్ 2, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత ఐదేళ్లుగా 'రాజధాని' అనే అంశం ఒక ముగింపు లేని ప్రహసనంలా సాగుతోంది. మూడు రాజధానులంటూ గతంలో చేసిన ప్రయోగాలు విఫలమై, ప్రస్తుతం అమరావతికి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పిస్తున్న తరుణంలో, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తాజాగా తెరపైకి తెచ్చిన 'మావిగన్' అనే వింత పేరు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాస్యాస్పదంగా మారింది. సీరియస్ రాజకీయాలు చేయాల్సిన సమయంలో జగన్ ఇలాంటి వింత పేర్లతో ముందుకు రావడంపై నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడుతున్నారు.అక్షరాలను కలిపి ఏదో ఇంటర్నేషనల్ బ్రాండ్ పేరులా వినిపిస్తున్న ఈ 'మావిగన్' అనే పదం వినగానే జనం నోరెళ్లబెడుతున్నారు. అసలు ఈ పేరు ఎక్కడ నుండి పుట్టింది? దీని వెనుక ఉన్న లాజిక్ ఏంటి? అని ఆరా తీస్తున్నారు. రాజధాని విషయంలో ఇప్పటికే ప్రజల్లో ఉన్న గందరగోళాన్ని తొలగించాల్సింది పోయి, ఇలాంటి అల్లాటప్పా పేర్లతో కాలయాపన చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "గతంలో మూడు రాజధానులు అన్నారు, ఇప్పుడు ఈ కొత్త 'గన్' ఎక్కడి నుండి వచ్చింది?" అంటూ సామాన్యులు జోకులు వేసుకుంటున్నారు.ఈ 'మావిగన్' పేరుపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించిన తీరు ఇప్పుడు ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతోంది. మీడియా ప్రతినిధులు ఈ పేరును ప్రస్తావించగానే, పవన్ కళ్యాణ్ ఆపుకోలేక నవ్విన తీరు జగన్ రాజకీయ పరిజ్ఞానంపై ఆయనకున్న అభిప్రాయాన్ని స్పష్టం చేసింది. "ఇన్ని వింత పేర్లు వీరికి ఎక్కడ దొరుకుతాయో ఏమో!" అన్నట్లుగా పవన్ ఇచ్చిన ఆ వెటకారపు నవ్వు, జగన్ ప్రతిపాదన ఎంత సిల్లీగా ఉందో చెప్పకనే చెప్పిఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా ఉండాల్సిన వ్యక్తి, ఇలాంటి హాస్యాస్పదమైన మాటలతో నవ్వులపాలవ్వడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పవన్ నవ్వు జగన్ వైఖరికి ఒక బలమైన మౌన కౌంటర్ లా మారిందని చర్చించుకుంటున్నారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన ఎక్స్, వాట్సాప్ గ్రూపుల్లో 'మావిగన్' పై రచ్చ మామూలుగా లేదు. "మావిగన్ అంటే ఏదో కొత్త రకమైన విదేశీ తుపాకీ పేరులా ఉంది" అని కొందరు సెటైర్లు వేస్తుంటే, మరికొందరు "సీజన్ మారినప్పుడల్లా రాజధాని పేరు మార్చడం జగన్ కే చెల్లింది" అని విమర్శిస్తున్నారు. జగన్ పాత వీడియోలను, ఇప్పటి మావిగన్ మాటలను కలిపి నెటిజన్లు క్రియేటివ్ పేరడీ వీడియోలు సృష్టిస్తున్నారు. ఒక సీరియస్ రాజకీయ అంశాన్ని జగన్ కామెడీ షోగా మార్చేశారని, అందుకే ఆయనను విమర్శించాలన్నా జాలి వేస్తోందని నెటిజన్లు 'పాపం జగన్' అంటూ హ్యాష్ ట్యాగ్‌లు ట్రెండ్ చేస్తున్నారు.అమరావతిని అడ్డుకోవడానికి జగన్ ఎన్ని దారులు వెతికినా చివరకు ఇలాంటి సిల్లీ ప్రతిపాదనల దగ్గరే ఆగిపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంట్ చట్టం చేస్తున్నా సరే, ఇంకా ఏదో ఒక వింత పేరుతో కాలయాపన చేయడం వల్ల పార్టీకే నష్టమని వైసీపీ నేతలు కూడా లోలోపల మదనపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.మొత్తానికి, 'మావిగన్' పేరుతో జగన్ రెడ్డి తన రాజకీయాల్లో మరో 'సెల్ఫ్ గోల్' వేసుకున్నారని స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన రాజధాని అంశాన్ని ఒక కుళ్లు జోక్ స్థాయికి తగ్గించేలా జగన్ వ్యవహరించడం శోచనీయమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకవేళ ఇది ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం అయితే, అది బెడిసికొట్టి జగన్ ఇమేజ్‌ను మరింత డ్యామేజ్ చేసిందనడంలో అతిశయోక్తి లేదు.

## పోలవరానికి నిధులు...

ఏలూరు, ఏప్రిల్ 2, ఏపీకి కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. ఏపీ జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టుకు రూ.1301 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులు పోలవరం ప్రాజెక్టు అకౌంట్లోకి నేరుగా జమ అవుతాయని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఏపీ విషయంలో కేంద్రం ఉదారంగా వ్యవహరిస్తోంది. మూడోసారి ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత వార్షిక బడ్జెట్లో అమరావతి రాజధానితో పాటు పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించింది. గతంలో రూ.1508 కోట్లు విడుదల చేయగా.. తాజాగా మరోసారి కేంద్రం అడ్వాన్సుడ్ నిధులు కేటాయించింది. మొత్తానికి ఈ 22 నెలల్లో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రూ.2809కోట్లు అందినట్లు అయింది. మరోవైపు ఈనెల 2న పోలవరం పర్యటనకు వెళ్తున్నారు గవర్నర్ అబ్దుల్ నజీర్. ఎప్పటికప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు పనులను సమీక్షిస్తూ వచ్చారు. పోలవరం పై కేంద్రానికి నివేదికలు ఇస్తూనే ఉన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ నిధులను కేటాయించింది. అయితే గత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల మేరకు నిధులు దాదాపుగా వచ్చేశాయి.కేంద్ర ప్రభుత్వం గతంలో రూ.1508 కోట్లు మంజూరు చేయగా అందులో రూ.600 కోట్లు ప్రాజెక్టు పనుల కోసం కేటాయించింది. మరో రూ.300 కోట్లు పునరావాసం, భూ సేకరణ కోసం ఖర్చు చేశారు. ఇటీవల కేంద్ర జలశక్తి అధికారులు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చారు. ఆ సమయంలో ఏపీ అధికారులు నీతుల విషయాన్ని ప్రస్తావించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు కోసం సింగిల్ నోడల్ అకౌంట్ కు నిధులను విడుదల చేయడం ఇదే చివరిసారి. ఇకపై స్పర్శ విధానంలో నిధులను విడుదల చేయనున్నారుసకాలంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిచేసి జాతికి అందించాలన్న లక్ష్యంతో ఉంది ఏపీ ప్రభుత్వం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో శరవేగంగా పనులు జరిపిస్తోంది. గత అనుభవాల దృష్ట్యా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని చూస్తోంది. అయితే మొన్నటి బడ్జెట్ సెషన్స్ లో సైతం ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పోలవరం ప్రాజెక్టు ప్రత్యేక ప్రస్తావన తీసుకొచ్చారు. ఆ ప్రాజెక్టుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే ఇప్పుడు భారీగా నిధులు కేటాయించారు. ఇది శుభ పరిణామం కూడా..

## తెగేదాక లాగుతున్న దువ్వాడ



శ్రీకాకుళం, ఏప్రిల్ 2, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మరో అసమ్మతి గళం సోషల్ మీడియా వేదికగా బయటకు వచ్చింది. వ్యక్తిగత వివాదాలతో పార్టీకి దూరం అయిన దువ్వాడ శ్రీనివాస్ ఇటీవలనే జగన్మోహన్ రెడ్డిని కలిశారు. త్వరలో వచ్చి కలుస్తానని చెప్పారు. మీరు ఎలా చెబితే అలా నడుచుకుంటానని కూడా అన్నారు. దీంతో దువ్వాడ శ్రీనివాస్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి రీఎంట్రీ ఇస్తారని ఆయన అభిమానులు తెగ హడావిడి చేశారు. కానీ ఇటీవల జరిగిన పరిణామాలతో దువ్వాడ శ్రీనివాస్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. వైసీపీలో ఆయన రీఎంట్రీ పై అనేక రకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన వైసీపీలో చేరడం దాదాపు అసాధ్యం అని కూడా తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో ఆయన వైసీపీలోకి తెచ్చుకునే ఛాన్స్ కనిపించడం లేదు శ్రీకాకుళం జిల్లాలో..ఇటీవల ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మూలపేట పోర్టు సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా శ్రేణులంతా హాజరయ్యాయి. అయితే దీనిపై దువ్వాడ ఇది ఎంత అధర్మం అంటూ పోస్ట్ చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన కార్యక్రమాన్ని పొలిటికల్ డ్రామాగా అభివర్ణించారు. పోర్టు లోపలికి 40 మందికి అనుమతి ఉంటే ధర్మాన ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. అధర్మంగా పూర్తికి పది మీటర్ల దూరంలో టెంట్లు వేసుకుని మాట్లాడి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. కోర్టుకు వంద మీటర్ల రోడ్డు కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాల కోసం అసలు ప్రస్తావించలేదని.. నిర్వాసితులకు తీవ్ర నిరాశ మిగిల్చారు అంటూ వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసిపి కార్యక్రమాన్ని దువ్వాడ శ్రీనివాస్ వ్యతిరేకించడం చూస్తుంటే మాత్రం ఆయన రీ యంట్రి విషయం తేలిపోయినట్లు అయింది.అధినేత జగన్మోహన్ రెడ్డి పట్ల వీర విధేయత ప్రదర్శిస్తూ వస్తున్నారు దువ్వాడ శ్రీనివాస్. కానీ జిల్లాలో ధర్మాన సోదరులను వ్యతిరేకిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు ఏకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని డ్రామా తో అభివర్ణించడంతో దువ్వాడ శ్రీనివాస్ కు దారులు మూసుకుపోయినట్టే. దువ్వాడ విషయంలో జిల్లాలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలంతా ఒకే మాటతో ఉన్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత వివాదాలతో పార్టీని ఇబ్బందుల్లో పెట్టిన దువ్వాడను మరోసారి పార్టీలోకి తీసుకోవద్దని జగన్మోహన్ రెడ్డికి తేల్చి చెప్పినట్లు సమాచారం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పోర్టు సందర్శన సక్సెస్ అయ్యిందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కానీ దువ్వాడ శ్రీనివాస్ మాత్రం అదే కార్యక్రమం పై విమర్శలు చేయడంపై వైసీపీ నాయకత్వం కూడా సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు డోర్స్ క్లోజ్ అయినట్టే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి దువ్వాడ శ్రీనివాస్ కు. చూడాలి మరి ఏం జరుగుతుందో..

## అయోమయంలో వైసీపీ..

## చిక్కుల్లో జగన్!



గుంటూరు, ఏప్రిల్ 2 ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత సున్నితమైన, కీలకమైన అమరావతి విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యూహాత్మక తప్పిదం చేసిందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. 2019–24 మధ్య మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి, ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకున్న తర్వాత కూడా ఆ పార్టీ తన పంథాను మార్చుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. తాజాగా లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే ఏపీ పునర్విభజన సవరణ బిల్లు–2026 ఆమోదం పొందిన వేళ.. జగన్ మోహన్ రెడ్డి తెరపైకి తెచ్చిన మావిగన్ అనే కొత్త ప్రతిపాదన ఆ పార్టీని మరింత రాజకీయ రక్షణలో పడేసింది.మచిలీపట్నం, విజయవాడ, గుంటూరులను కలిపి మావిగన్ అనే గ్రోత్ కారిడార్‌ను రాజధానిగా జగన్ ప్రతిపాదించడం ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. అయితే, పార్లమెంట్ సాక్షిగా అమరావతికి శాసనపరమైన గుర్తింపు దక్కిన ఈ తరుణంలో ఇలాంటి ప్రతిపాదనలు చేయడం చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం లాంటిదేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమరావతి ఇప్పుడు కేవలం ఒక రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మాత్రమే కాదు, అది పార్లమెంట్ ఆమోదించిన చట్టం. జగన్ భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా తన వ్యక్తిగత కార్యాలయాలను ఎక్కడైనా పెట్టుకోవచ్చు కానీ, రాజధానిని తరలించడం అనేది ఇప్పుడు అసాధ్యమైన ప్రక్రియగా మారింది.రాజధాని విషయంలో వైసీపీ అనుసరిస్తున్న దోబూచులాట ఆ పార్టీ క్యాడర్‌ను కూడా గందరగోళానికి గురిచేస్తోంది. ఒకవైపు అమరావతికి తాము వ్యతిరేకం కాదని చెబుతూనే, మరోవైపు పార్లమెంట్‌లో బిల్లును వ్యతిరేకించి వాకౌట్ చేయడం ద్వారా తమ ద్వంద్వ వైఖరిని బయటపెట్టుకున్నారు. ఈ సమయంలో అమరావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, కేవలం అక్కడ జరుగుతున్నట్లుగా తాము భావిస్తున్న అవినీతి పై మాత్రమే పోరాటం చేసి ఉంటే వైసీపీకి రాజకీయంగా మైలేజీ దక్కేది. కానీ, ఇప్పుడు మావిగన్ వంటి కొత్త పేర్లతో గందరగోళం సృష్టించడం వల్ల ప్రజల్లో ఆ పార్టీ విశ్వసనీయత మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది.అమరావతిని స్మశానం అని, గ్రాఫిక్స్ అని ఎద్దేవా చేసిన నేతలే, ఇప్పుడు రాజధాని హోదా కల్పించడాన్ని తప్పుపడుతున్నారు. సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు వంటి వారు అన్నీ అమరావతికే చేస్తే మేము అడుక్కుతినాలా? అని చేస్తున్న వ్యాఖ్యలు ప్రాంతీయ విద్వేషాలను రేకెత్తించేలా ఉన్నాయి. ఇలాంటి వ్యాఖ్యలను కట్టడి చేయకుండా, జగన్ కూడా అదే బాటలో ప్రయాణించడం ఆయన రాజకీయ భవిష్యత్తుకే ముప్పు తెచ్చేలా ఉంది. అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే ముద్ర ఇప్పటికే పడటంతో, మావిగన్ ప్రతిపాదన ఆ ముద్రను మరింత బలపరుస్తోంది. రాజకీయాల్లో టైమింగ్ చాలా ముఖ్యం. కేంద్రం అమరావతికి నిధులు ఇవ్వడమే కాకుండా చట్టబద్ధత కూడా కల్పిస్తున్నప్పుడు, దానికి క్రెడిట్ రాకుండా చూడటం లేదా ఆ క్రెడిట్‌లో భాగస్వామ్యం కావడం విజ్ఞత అనిపించుకుంటుంది. కానీ వైసీపీ వ్యూహకర్తలు జగన్ చేత చట్టాన్ని సవరించలేరా అనే వ్యాఖ్యలు చేయించడం ద్వారా తాము అభివృద్ధి నిరోధకులమనే సంకేతాలు పంపారు. పోతరాజు తనను తాను కొట్టుకున్నట్లుగా, కేవలం పంతం కోసమే రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిలబడుతున్నామనే అభిప్రాయం ప్రజల్లో కలిగేలా ఈ మావిగన్ రాజకీయం సాగుతోందన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

## గిరిజనులకు తప్పని డోలి కష్టాలు

అల్లూరి ఏజెన్సీ గిరిజనులకు డోలి కష్టాలు తప్పడంలేదు. అల్లూరి జిల్లా దుంబ్రిగూడ మండలం డొక్రిపాడులో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పురిటి నొప్పులతో బాధపడుతున్న భార్యను రోడ్డు సౌకర్యం లేక భర్త, కుటుంబ సభ్యులు కలిసి 5 కిలోమీటర్ల మేర డోలిలో మోసుకెళ్లారు. రోడ్డు సౌకర్యం లేక కష్టాలు తప్పడం లేదని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కోదాడలోని షాపులకు రెడ్ లైన్ విధించిన ఎస్సై అంజిరెడ్డి





సూర్యాపేట కోదాడ ఎస్సై అంజిరెడ్డి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కానిస్టేబుల్ అందరు కలిసి రోడ్డు మీద ఉన్న ట్రాఫిక్కు విరుద్ధంగా ఉన్న షాపులను రోడ్ల మీదకి రాకుండా వాళ్ళ స్థలాలలో వాళ్ళు ఉండేటట్టుగా ఒక రెడ్ లైన్ ను కలర్ పెయింట్ తో గీసారు. పూల షాపులలో ఓనర్లకి వ్యాపారస్తులకి ట్రాఫిక్ ఇబ్బందులు కలవకుండా పార్కింగ్ ప్లేస్ ను ఉంచి ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉండ వద్దని వ్యాపారస్తులకు సూచనలు సలహాలు ఇచ్చారు. పార్కింగ్ ప్లేస్ ను ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూపించారు. నిబంధన లనుఅనుసరించిట్రాఫిక్ నిబంధనలను విరుద్ధంగా ఉంటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

## యానిమేటర్లకు 5 జీ న్యూస్

విజయవాడ, ఏప్రిల్ 2,ఏపీ ప్రభుత్వం రెండు నెలల క్రితం యానిమేటర్లకు ఇచ్చిన హామీ ఇచ్చిన హామీని త్వరలోనే నెరవేర్చనుంది. యానిమేటర్లందరికీ 5జీ మొబైల్స్ ఇవ్వబోతోంది. ఇప్పటికే అధికారులు జిల్లాలకు మొబైల్స్‌ను పంపించారు. త్వరలోనే యానిమేటర్లకు మొబైల్స్‌ను పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. యానిమేటర్లకు ఇస్తున్న ఒక్కో ఫోన్ విలువ రూ.15 వేలు.. ఈ కొత్త మొబైల్స్ ద్వారా సేవల్ని మరింత వేగవంతం చేస్తామని యానిమేటర్లు చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యానిమేటర్లకు (వీవోఏ) తీపికబురు చెప్పింది. రెండు నెలల క్రితం చెప్పిన విధంగా యానిమేటర్లకు 5జీ మొబైల్స్‌ను అందించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు జిల్లాలకు మొబైల్స్‌ను ఇప్పటికే పంపించారు.. అవి డీఆర్డీఏ కార్యాలయాలకు చేరాయి. త్వరలోనే మొబైల్స్‌ను యానిమేటర్లకు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. యానిమేటర్లకు ఇస్తున్న ఒక్కో ఫోన్ ధర రూ. 15 వేల వరకు ఉంటుందని చెబుతున్నారు. ఈ మొబైల్స్ ద్వారా యానిమేటర్లు ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించనున్నారు.డీఆర్‌డీఏ (జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో యానిమేటర్లు పొదుపు సంఘాలకు అండగా ఉంటున్నారు. సంఘాల పని తీరు పర్యవేక్షించడం, బుక్ కీపింగ్, బ్యాంకు లింకేజీ, రుణాలు ఇప్పించడం, ప్రభుత్వ రాయితీలు, వడ్డీ లేని రుణాలు, కొత్త సంఘాలను ఏర్పాటు చేయడం, డబ్బులు–మన లెక్కలు అనే యాప్‌కు సంబంధించిన సేవలను యానిమేటర్లు అందిస్తున్నారు. వీరు విధినిర్వహణలో భాగంగా కొన్ని యాప్స్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. అయితే వీరికి గతంలో ఇచ్చిన మొబైల్స్, ట్యాబ్స్ పనిచేయకపోవడంతో.. సొంత మొబైల్స్ వాడుతున్నారు. కొంత మంది ఫోన్లు మొరాయించడంతో ఇబ్బంది పడుతున్నారు.దీంతో తమకు మొబైల్స్ ఇవ్వాలని యానిమేటర్లు ప్రభుత్వాన్ని కోరారు. వారిని వినతి పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మొబైల్స్ అందించాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27 వేల 500 మంది యానిమేటర్లు.. 5 వేల మంది కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు మొబైల్స్ అందించనున్నారు. ఈ మొబైల్స్ అందిస్తే సేవల్ని మరింత వేగవంతం చేస్తామని యానిమేటర్లు చెబుతున్నారుఏపీ ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు కూడా మొబైల్స్ అందించిన సంగతి తెలిసిందే. వారికి ఒక్కొక్కరికి రూ.12,500 విలువైన ఫోన్లను అందించడం కోసం ప్రభుత్వం రూ.74 కోట్లు ఖర్చు చేసింది. అంగన్‌వాడీలలో లబ్ధిదారుల వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీ ప్రభుత్వం వారందరికి మొబైల్స్ అందించింది. మొత్తం మీద అంగన్‌వాడీలకు మొబైల్ కష్టాలు తీరిపోగా.. ఇటు త్వరలోనే యానిమేటర్లకు కూడా కొత్త 5జీ మొబైల్స్ అందజేయనున్నారు.

## హైదరాబాద్ కు రెండు విమాన సర్వీసులు

విజయవాడ, ఏప్రిల్ 2, ఏపీ నుంచి కొత్తగా పలు విమాన సర్వీసులు ప్రారంభంకానున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌కు కనెక్టవిటీని పెంచేలా ఈ సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. రాజమహేంద్రవరం నుంచి మూడు కొత్త సర్వీసులు ప్లాన్ చేయగా.. తాజాగా విజయవాడ నుంచి హైదరాబాద్‌కు కొత్తగా మరో రెండు విమాన సర్వీసులు ప్రారంభించనున్నారు. ఈ నెల 10 నుంచి ఒక విమాన సర్వీసు, 17 నుంచి మరో సర్వీస్ అందుబాటులోకి రానుంది విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్‌కు రెండు కొత్త విమాన సర్వీసులు నడపనున్నట్లు విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. ఈ నెల 10 నుంచి ఫ్లై–91 ఎయిర్‌లైన్స్ సంస్థ ఈ రెండు సర్వీసులు ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ కొత్త విమాన సర్వీస్ హైదరాబాద్‌లో ఉదయం 6.05 గంటలకు బయల్దేరి ఉదయం 7.10 నిమిషాలకు విజయవాడ చేరుకుంటుంది అన్నారు. ఈ విమానం తిరుగు ప్రయాణంలో విజయవాడ నుంచి ఉదయం 07:30గంటలకు బయలుదేరి ఉదయం 08:40గంటలకు హైదరాబాద్‌కు వెళుతుందన్నారు.,ఈనెల 17 నుంచి ఫ్లై–91 ఎయిర్‌లైన్స్ సంస్థకు చెందిన మరో సర్వీసు హైదరాబాద్–విజయవాడ మధ్య అందబాటులోకి వస్తుందని లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. ఈ విమానం 10:10 గంటలకు విజయవాడ నుంచి బయల్దేరి.. ఉదయం 11:30 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటుందని ప్రకటించారు. ఈ రెండు సర్వీసుల్లో విమాన ఛార్జీలు రూ.4వేల నుంచి రూ.8 వేల మధ్య ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ఈ రెండు విమాన సర్వీసుల్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రజలకు ప్రజలకు విమానయానాన్ని మరింత చేరువ చేయడంతో పాటు.. ప్రధాన నగరాల మధ్య విమానయాన అనుసంధానానికి ఉడాన్ పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలోని కడప, కర్నూలు విమానాశ్రయాలను ఉడాన్ ఫథకం కింద అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారువిజయవాడ మాత్రమే కాదు రాజమహేంద్రవరం నుంచి కూడా కొత్తగా మూడు విమాన సర్వీసులు ప్రారంభంకానున్నాయి. ఈ సర్వీసులు కూడా రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు నడపనున్నారని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజయవాడ నుంచి విమాన సర్వీసుల సంఖ్య పెరిగింది. హైదరాబాద్‌తో పాటూ మరికొన్ని నగరాలకు విమానాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇటీవల విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బోయింగ్ విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. విజయవాడ రాజధాని అమరావతి ప్రాంతానికి సమీపంలో ఉండటంతో ప్రయాణికుల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది.. దీంతో రద్దీ కనిపిస్తోంది.

## ఏప్రిల్ లోనే గూగుల్ డేటా సెంటర్ భూమి పూజ

విశాఖపట్టణం, ఏప్రిల్ 2, విశాఖపట్నం జిల్లాలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు చకచకా అడుగులు పడుతున్నాయి. తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే భూములు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా భూములలో జంగల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నారు. ఈ పనులు కూడా ముగింపు దశకు చేరుకుంటున్నాయి. మరోవైపు గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి ఈ నెలలోనే భూమి పూజ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.విశాఖపట్నం జిల్లాలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆనందపురం మండలంలోని తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. డేటా సెంటర్ ప్రాజెక్టు కోసం కేటాయించిన భూముల్లో అధికారులు జంగల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నారు. డేటా సెంటర్ కోసం తర్లువాడలోని సర్వేనంబర్ ఒకటిలో ఉన్న 308 ఎకరాలను ఏపీ ప్రభుత్వం గూగుల్ సంస్థకు కేటాయించింది. అలాగే ఆయా భూముల రైతులకు ఇప్పటికే నష్టపరిహారాన్ని జమ చేసింది. గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించిన భూములలో మామిడి, జీడి మామిడి వంటి తోటలు, ఇతర చెట్లు ఉన్నాయి. వీటిని తొలగించే పనిని ఏపీ ప్రభుత్వం ఏపీఐఐసీకి అప్పగించింది.ఏపీఐఐసీ ఓ కాంట్రాక్టర్‌కు ల్యాండ్ స్కేపింగ్ పనులు అప్పగించింది. ఈ నేపథ్యంలో సదరు కాంట్రాక్ట్ సంస్థ జంగల్ క్లియరెన్స్ పనులు చేపట్టగా.. మెజారిటీ పనులు పూర్తయ్యాయి. భూమిని చదును చేయాల్సి ఉంది. మరోవైపు ఏప్రిల్ నెలలోనే గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే పనులు వేగవంతం చేశారు. మరోవైపు గూగుల్ అనుబంధ సంస్థ అయిన రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని నోటిఫైడ్ భాగస్వామ్య సంస్థ కలిసి 1000 మెగావాట్ల సామర్థ్యంతో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. ఈ డేటా సెంటర్ కోసం15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది.ఈ ప్రాజెక్టు కోసం ఏపీ ప్రభుత్వం తొలుత విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో 480 ఎకరాలు కేటాయించింది. అయితే గూగుల్ ప్రతినిధులు అదనపు భూములు కోరటంతో.. ఏపీ ప్రభుత్వం రాంబిల్లిలో 174.8 ఎకరాలు, తర్లువాడ లో 266.6 ఎకరాలు, అడవివరంలో 160 ఎకరాలను కలిపి 601.4 ఎకరాలను కేటాయించింది. ముందుగా అనుకున్న ప్రకారం తొలుత తర్లువాడలో డేటా సెంటర్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్ల కోసం ఏపీ పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఇటీవలే విశాఖపట్నంలో పర్యటించారు. ఏపీఐఐసీ అధికారులతో తర్లువాడ భూములను పరిశీలించారు.

## రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి



హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవనూరు వద్ద ఘోరా ప్రమాదం జరిగింది. కారు చెట్టును ఢీకొనడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. కారులోని మరో ఐదుగురు గాయపడ్డారు. మృతులు జనగామ జిల్లా, తరిగొప్పుల మండలం నర్సాపూర్కు చెందిన ఏనుగుల శివ, లోకేష్గా గుర్తించారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో డివిజన్లు పెంపు

అమరావతి: రాష్ట్రంలోని అన్ని నగర పాలక సంస్థల్లో డివిజన్ల సంఖ్యను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ డైరెక్టరు సంపత్కుమార్ సర్క్యులర్ విడుదల చేశారు. కార్పొరేషన్లలో జనాభాకు తగిన విధంగా డివిజన్లు పెంచేందుకు ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయం మేరకు ఈ పెంపుదల జరుగుతుందని అందులో పేర్కొన్నారు. మొత్తం 13 కార్పొరేషన్లలో డివిజన్లను పెంచారు.

# 50 రోజులు జైల్లో, 25 రోజులు హోటల్లో..

## ఇరాన్ నుంచి క్షేమంగా స్వదేశానికి 8 మంది భారతీయులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2, (న్యూస్ పల్స్) అమెరికా–ఇజ్రాయెల్ దాడికి ముందు రోజు ఇరాన్ జైలు నుంచి విడుదలైన 10 మంది భారతీయ నావికులు.. యుద్ధ భూమిలో చిక్కుకున్నారు. వారు బయలుదేరాల్సిన రోజనే యుద్ధం మొదలైంది. దీంతో తాము బసచేసిన హోటల్లోనే ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని గడిపారు. బాంబులు, క్షిపణులు మోత మధ్య గడిపిన భారతీయులు.. చివరకు అర్మేనియా సరిహద్దులకు వచ్చి.. రెండు రోజుల కిందట భారత్కు చేరుకున్నారు. వారు తమకు ఎదురైన భయానక అనుభవాన్ని మీడియాతో పంచుకున్నారు. గతేడాది డిసెంబరులో అక్రమంగా చమురు తరలిస్తున్నారనే ఆరోపణలతో భారతీయ సిబ్బంది ఉన్న దుబాయ్ ఆయిల్ ట్యాంకర్ ఇరాన్ నౌకాదళం స్వాధీనం చేసుకుంది. అందులోని 10 మంది భారతీయ సిబ్బందిని అదుపులోకి తీసుకుని, మిగతావారిని నౌకలో ఉంచింది. వీరు జైల్లో 50 రోజులు ఉండి ఫిబ్రవరి 27న విడుదలయ్యారు. ఆ మర్నాడు స్వదేశానికి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకోగా.. అదే రోజు ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్లు సంయుక్తంగా ఇరాన్పై దాడులు ప్రారంభించడంతో ప్లాన్ మొత్తం అడ్డం తిరిగింది. ఇరాన్ నుంచి బయటపడే మార్గం లేకపోవడంతో 25 రోజుల పాటు హోటల్లో ఉండి.. చివరకు క్షేమంగా 8 మంది సోమవారం స్వదేశానికి చేరుకున్నారు. మీరట్కు చెందిన విజయ్ కుమార్, ఘజియాబాద్కు చెందిన కేతన్ మెహతా అనే ఇంజినీర్లు ఇందులో ఉన్నారు. తాము జైలు నుంచి విడుదలైన తర్వాత ఓ హోటల్లో దిగామని, యుద్ధం ఇంత తీవ్రమవుతుందని అనుకోలేదని మెహతా అన్నారు. "మేము జైలు నుంచి బయటకు వచ్చి ఒక హోటల్లో బస చేసినప్పుడు, యుద్ధం రాబోతోందని మాకు ఏమాత్రం తెలియదు. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్లు మరుసటి రోజే యుద్ధం మొదలుపెట్టాయి. మేము పూర్తిగా నిశ్చేష్టులయ్యాం.. అన్నీ మూతపడ్డాయి– విమానాశ్రయం కూడా మూసేశారు" అని అన్నారు. అమెరికా– ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్న ఇరాన్ నావికాదళ ప్రధాన స్థావరం బందర్ అబ్బాస్ పట్టణానికి తాను బసచేసిన హోటల్ కేవలం 600–700 మీటర్ల దూరంలో ఉందని చెప్పాడు.'మేము రాయబార కార్యాలయాన్ని సంప్రదించడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో హోటల్ నుంచి బయటకు అడుగు పెట్టవద్దని మాకు సూచించారు. రోజురోజుకూ, మేము బాంబులు, క్షిపణుల శబ్దాలు ఎక్కువయ్యాయి.. మేము కిటికీలు తెరిచి చూస్తే మా కళ్ల ముందే క్షిపణులు వర్షంలా కురిసేవి.. రోజుకు 100 నుంచి 200 వరకు బాంబు పడేవి.. బందర్ అబ్బాస్ నుంచి 1,800 కిలోమీటర్ల దూరంలోని అర్మేనియా సరిహద్దుకు బస్సులో 18 నుంచి 19 గంటలు ప్రయాణించి చేరుకున్నాం.. ఈ సమయంలో బాంబుల మోత మోగుతూనే ఉంది.. " అని తెలిపాడు. భారత రాయబార కార్యాలయం అధికారులు తమతో నిరంతరం సంప్రదిస్తూనే ఉన్నారని మెహతా అన్నాడు.దుబాయ్ కంపెనీ ప్రైమ్ ట్యాంకర్స్ ఎల్ఎల్సీ ఆధ్వర్యంలోని ఎంటీ వలియంట్ రోర్ ఆయిల్ ట్యాంకర్ను అంతర్జాతీయ జలాల్లో అక్రమంగా చమురు తరలిస్తున్నారని ఆరోపిస్తూ డిసెంబరు 8న ఇరాన్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కానీ, ఈ ఆరోపణలను సదరు కంపెనీ తోసిపుచ్చింది. నౌకలోని క్రూ సిబ్బంది పది మందిని బందర్ అబ్బాస్ జైలుకు తరలించిన 10 మందిని కాన్సులర్ పద్ధతిలో కలిసేందుకు తమకు అనుమతి లభించిందని విదేశాంగ శాఖ తెలిపింది. నౌకలో మొత్తం 18 మంది సిబ్బంది ఉండగా.. వీరిలో 16 మంది భారతీయులు, ఒకరు శ్రీలంక, బంగ్లాదేశ్కు చెందిన పౌరులు

# 35 ఏళ్ల తర్వాత

# అప్పుడు జయలలిత .. ఇప్పుడు విజయ్





చెన్నై, ఏప్రిల్ 2, (న్యూస్ పల్స్) తమిళనాడు అసెంబ్లీలో దళపతి విజయ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఒంటరిగానే పోటీచేస్తున్న తమిళగ వెట్రి కళగం ఏ మేరకు ప్రభావం చూపుతుందో మే 4న తేలిపోనుంది. ఈ ఎన్నికల్లో విజయ్ రెండు చోట్ల నుంచి బరిలో దిగారు. 35 ఏళ్ల తర్వాత ఇలా ఒకే అభ్యర్థి తమిళనాడు ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయడం గమనార్హం. గతంలో అన్నాడీఎంకే అధినేత్రి దివంగత జయలలిత మాత్రమే రెండు చోట్ల పోటీచేసి గెలిచారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే చీఫ్, దళపతి విజయ్ ఒంటరిగా దిగి సాహసం చేస్తున్నారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ శాసనసభ స్థానాల నుంచి ఆయన బరిలోకి దిగుతున్నారు. తొలి అడుగులో రాజకీయ స్థిరత్వం కోసం వ్యూహాత్మకంగా విజయ్ అడుగులు వేస్తున్నారు. భారీగా ఉన్న అభిమానగణం ఆయనకు ఓటు బ్యాంకుగా మారతారా? అనే సందేహం అందరిలోనూ ఉంది. అందుకే ఒకచోట ఓడిపోయినా మరోచోట గెలుపు సాధ్యమనే ధీమాతోనే రెండు స్థానాలను ఎంచుకున్నట్టు తెలుస్తోంది. తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత తర్వాత రెండు స్థానాల నుంచి బరిలోకి దిగుతున్న నేతగా విజయ్ గుర్తింపు పొందారు. తమిళనాడు అసెంబ్లీకి మొత్తం 234 స్థానాలకు ఏప్రిల్ 23న ఒకే దశలో పోలింగ్ జరగనుంది. మే 4న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడిస్తారు.ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. ఒక అభ్యర్థి ఒకేసారి రెండు స్థానాల నుంచి పోటీ చేయొచ్చు. ఆ రెండు చోట్లా గెలిస్తే ఏదో ఒక దానికి మాత్రం రాజీనామా చేయాలి. 1991 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బర్గూర్, కాంగేయం నుంచి పోటీచేసిన జయలలిత .. రెండింటిలోనూ విజయం సాధించారు. దీంతో కాంగేయం సీటును వదులుకుని బర్గూర్ ఎమ్మెల్యేగా అమ్మ కొనసాగారు. సరిగ్గా మూడున్నర దశాబ్దాల తర్వాత రెండు అసెంబ్లీ స్థానాల నుంచి విజయ్ బరిలోకి దిగుతుండటం గమనార్హం. ఈ ఎన్నికల్లో తనకు, అధికార డీఎంకే మధ్యనే పోటీ జరుగుతుందని విజయ్ ప్రకటించారు. ఇక, అన్ని రాజకీయ పార్టీల మాదిరిగానే టీవీకే సైతం ప్రజాకర్షక హామీలను ప్రకటించింది. 2001 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాప్రాతినిధ్య చట్టం నిబంధనలను ఉల్లంఘించేలా ఏకంగా నాలుగు చోట్ల జయలలిత నామినేషన్ దాఖలు చేశారు. కృష్ణగిరి, భువనగిరి, ఆండిపట్టి, పుదుకోట్టై నుంచి పోటీకి సిద్ధమయ్యారు. కానీ, టాన్సీ భూముల కేసులో ఆమె దోషిగా నిర్ధారణ అయి శిక్ష ఖరారు కావడంతో నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అయితే, 2006 ఎన్నికల్లో రెండు స్థానాల నుంచి డీఎండీకే అధ్యక్షుడు, కెప్టెన్ విజయకాంత్ పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. కానీ, ఆయన కేవలం విరుదునగర్ నుంచి మాత్రమే పోటీచేసి విజయాన్ని అందుకున్నారు.

# బెంగాల్ లో కాంగ్రెస్ ఒంటరి పోరు

కోల్ కత్తా, ఏప్రిల్ 2 (న్యూస్ పల్స్) పశ్చిమ బెంగాల్ రాజకీయ ముఖచిత్రం ఎన్నికల వేళ మరింత ఆసక్తికరంగా మారుతోంది. త్వరలో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో జాతీయ పార్టీ కాంగ్రెస్ ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీల మధ్య ప్రధానంగా పోరు నెలకొన్న ఈ రాష్ట్రంలో.. మొత్తం 294 అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీతోనూ పొత్తు లేకుండా సొంతంగా అభ్యర్థులను బరిలోకి దించాలని కాంగ్రెస్ అధిష్ఠానం అధికారికంగా తీర్మానించింది.అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల వ్యూహాల ఖరారుపై ఢిల్లీలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సుదీర్ఘంగా సమావేశమైంది. ఈ అత్యున్నత స్థాయి భేటీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ సహా పలువురు ముఖ్య సీనియర్ నాయకులు పాల్గొన్నారు. బెంగాల్లోనిక్షేత్రస్థాయి పరిస్థితులు, అభ్యర్థుల బలాబలాలు, గెలుపు అవకాశాలపై నాయకులు కూలంకషంగా చర్చించారు.కాంగ్రెస్ పార్టీ తాజా నిర్ణయంతో క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. ఒంటరిగా పోటీ చేయాలన్న నిర్ణయానికి ఆశావహుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఏఐసీసీ పశ్చిమ బెంగాల్ ఇన్ఛార్జి గులాం అహ్మద్ మీర్ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. "మా పార్టీ రాష్ట్రంలోని మొత్తం 294 అసెంబ్లీ స్థానాల్లోనూ పూర్తి స్థాయిలో పోటీ చేస్తుంది. ఎన్నికల బరిలో నిలిచేందుకు పార్టీ శ్రేణుల నుంచి ఏకంగా 2,500 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. సీఈసీ సమావేశంలో ఈ దరఖాస్తులన్నింటిపైనా లోతుగా సమీక్షించాం. త్వరలోనే తుది జాబితాను ప్రకటిస్తాం" అని స్పష్టం చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలతో కలిసి కూటమిగా ఏర్పడి పోటీ చేసిన కాంగ్రెస్.. ఈసారి స్వతంత్రంగా అదృష్టాన్ని పరీక్షించుకోనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. సగటున ఒక్కో నియోజకవర్గానికి 8 నుంచి 9 మంది నాయకులు పోటీ పడుతుండటం పార్టీ కేడర్లో పెరుగుతున్న ఉత్సాహానికి అద్దం పడుతోంది. దశాబ్దాలుగా బెంగాల్లో కోల్పోయిన తమ పాత ఓటు బ్యాంకును తిరిగి సొంతం చేసుకోవడంతో పాటు, రాష్ట్రంలో పార్టీ పునాదులను స్వతంత్రంగా బలోపేతం చేసుకోవడానికే కాంగ్రెస్ ఈ వ్యూహాత్మక అడుగు వేసినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక కొలిక్కి రావడంతో కాంగ్రెస్ ప్రచార పర్వం ఇక ఊపందుకోనుంది.

# కేబీఆర్ పై ఓవర్ పనులు వేగవంతం చేయాలి

## స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్



హైదరాబాద్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పురపాలక శాఖ స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ గురువారం ఉదయం బంజారాహిల్స్ లోని కేబీఆర్ పార్క్ కొనసాగుతున్న ఫ్లై ఓవర్ పనులను పర్యవేక్షించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టిందని అయన అన్నారు. పనులు వేగంతం చేయడంతోపాటు ప్రతి వారం పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించాలని అయన అన్నారు. మేఘా ఇంజనీరింగ్ సంస్థ కుడా అదనపు సిబ్బంది, మరిన్నీ యాంత్రిక పరికరాలను వినియోగించాలని అయన ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ తదితరులు పాల్గోన్నారు.

## యువకుడు అనుమానాస్పద మృతి



తిరుపతి ఒక యువకుడు మృతి చ,ఎందిన ఘటన చంద్రగిరి పట్టణంలోని కొత్తపేట మార్కెట్ యార్డ్ సమీపంలో జరిగింది. మృతుడు కుంట్రపాకం కు చెందిన మహేష్ (31)గా గుర్తించారు. మొదటి భార్యతో విడాకులు పొంది రెండో భార్యతో కొత్తపేటలో ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు.

## తాడ్ బంద్ ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు



సికింద్రాబాద్ హనుమాన్ జయంతిని పురస్కరించుకొని తాడబంద్ వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఉదయం నుండి భక్తులు బారులు తీరారు. మాజీ మంత్రి మల్లారెడ్డి, మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, దేవాలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూ లైన్ లను ఏర్పాటు చేసి భారీ బందోబస్తు మధ్య స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు ఆలయ అధికారులు.

## రాజ్యాంగేతర శక్తిగా ఐఏఎస్...

హైదరాబాద్, ఏప్రిల్ 2 సాధారణంగా మనం రాజకీయ నాయకులను అత్యంత శక్తివంతులైన వారిగా భావిస్తుంటాం.. వారు తలచుకుంటే ఏదైనా చేయగలరని అనుకుంటాం. కానీ రాజకీయ నాయకులను మించిపోతున్నారు నేటి కాలంలో అధికారులు. ముఖ్యంగా కొంతమంది బ్యూరో క్రాట్ లు సమాంతర వ్యవస్థను నడిపిస్తున్నారు. గతంలో ఇలా ఉండేది కాదు. ఇప్పుడు రాజకీయ నాయకులకు సంపాదన మీద విపరీతమైన యావ పుట్టింది కాబట్టి.. అక్రమ అర్జనకు అధికారుల అండ కావాలి కాబట్టి.. అటువంటి అధికారులు తమకు తాముగా స్వీయ శక్తిని పెంచుకొని వ్యవస్థలకు మించి ఎదుగుతున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఓ మంత్రి కుటుంబ సభ్యులు హైదరాబాద్ నగర శివారులో ఓ గ్రామంలో భూముల కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ఆ భూములను ఇవ్వకపోతే వారిని అంతం చేస్తారని బెదిరించినట్టు వార్తలు వినిపించాయి. వారికి ప్రతిపక్ష పార్టీ అండగా నిలిచింది. వారు ఇచ్చిన ఆధారాలను విలేకరుల ఎదుట ప్రదర్శించింది. ఆ మంత్రి కుమారుడు.. బంధువులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.. ఈ నేపథ్యంలో ఆ విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రతిపక్ష నాయకుడు ఓ ఐఏఎస్ అధికారి గురించి ప్రధానంగా ప్రస్తావించారు. ఆ అధికారి మంత్రి కుటుంబ సభ్యులతో మిలాఖత్ అయ్యారని.. ఆయన అండదండలతోనే మంత్రి కుటుంబ సభ్యులు రెచ్చిపోతున్నారని ఆ ప్రతిపక్ష నాయకుడు ఆరోపించారు.. ఆ అధికారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆ అధికారి పేరును పదేపదే ప్రస్తావించిన నేపథ్యంలో.. ఆయన గురించి విస్తృతంగా చర్చ జరుగుతుంది. ఇప్పటి అధికార పార్టీలోనే కాదు.. గత అధికార పార్టీలోనూ ఆ సీనియర్ ఐఏఎస్ అధికారి ముఖ్య భూమిక పోషించారు. నాడు ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులో ఆ ఐఏఎస్ అధికారి తనకు అనుకూలంగా నిబంధనలు మార్చారు. భూములను మొత్తం నచ్చిన వాళ్లకు కట్టబెట్టారు. ఏళ్ల తరబడి ఆయన అదే పోస్టులో ఉన్నారు.. ఒక సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసుకొని.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం మాత్రమే కాదు.. సొంత ఆస్తులను విపరీతంగా పెంచుకున్నారు.. అప్పట్లో ఓ రాజకీయ పార్టీకి ఆ అధికారి భారీగా విరాళం కూడా ఇచ్చినట్టు వార్తలు వచ్చాయి.నాడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ అధికారి రెవెన్యూ విభాగంలో కింగ్ పిన్ మాదిరిగా వ్యవహరించాడు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఆయన అదే శాఖలో కొనసాగుతున్నాడు. అంతేకాదు అంతకుమించి అనే స్థాయిలో దోపిడికి పాల్పడుతున్నాడు. సదరు అధికారి గురించి ఇటీవల ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన కీలక నాయకుడు చేసిన ఆరోపణలు నూటికి నూరు శాతం నిజం. కాకపోతే, ఆ ప్రతిపక్ష నాయకుడు తెలంగాణ ప్రభుత్వంలో షాడో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా..ఆ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నాడు ఆ అధికారితో సదరు కీలక ప్రతిపక్ష నాయకుడు చెట్టా పట్టాలు వేసుకొని తిరిగాడు. దీనినిబట్టి అధికారం ఉన్నప్పుడు ఒక విధంగా.. అధికారం లేనప్పుడు మరొక విధంగా మాట్లాడటం రాజకీయ నాయకులకు పరిపాటిగా మారిందనే సందర్భాన్ని మనం ఇక్కడ గుర్తు చేసుకోవాలి.

# రోజుకు 15 కోట్ల పౌల్ట్రీ వ్యాపారం నష్టం



హైదరాబాద్, ఏప్రిల్ 2, హైదరాబాద్ మహానగరంలో చికెన్ ప్రియులకు పెద్ద షాక్ తగిలింది. నగరంవ్యాప్తంగా వందలాది చికెన్ షాపులు స్వచ్ఛందంగా మూతపడటంతో మాంసం విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. సాధారణ రోజుల్లోనూ కిటకిటలాడే చికెన్ సెంటర్లు వెలవెలబోవడానికి ప్రధాన కారణం రిటైల్ వ్యాపారులకు, హోల్‌సేల్ సరఫరాదారులకు మధ్య తలెత్తిన మార్జిన్ వివాదం . తమకు వస్తున్న లాభం నామమాత్రంగా ఉందని, పెరిగిన ఖర్చులకు అనుగుణంగా మార్జిన్ పెంచకపోతే వ్యాపారం చేయలేమని రిటైలర్లు సమ్మెకు దిగారు. ఈ వివాదానికి ప్రధాన కేంద్రం చికెన్ విక్రయాలపై వచ్చే కమిషన్. ప్రస్తుతం బాయిలర్ కంపెనీలు రిటైల్ షాపుల యజమానులకు కిలోకు కేవలం రూ. 5 నుండి రూ. 7 వరకు మాత్రమే మార్జిన్ ఇస్తున్నాయి. అయితే, గత కొన్నేళ్లుగా షాపుల అద్దెలు, కరెంట్ బిల్లులు, పనివారి జీతాలు, మున్సిపల్ పన్నులు భారీగా పెరిగాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కిలోకు రూ. 15 నుండి రూ. 20 మార్జిన్ ఇస్తేనే తాము బతకగలమని, లేదంటే నష్టాల్లో కూరుకుపోతామని వారు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని గ్రేటర్ చికెన్ మర్చంట్స్ అసోసియేషన్ ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. బాయిలర్ చికెన్ కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి ధరలను నియంత్రిస్తున్నాయని, తక్కువ మార్జిన్‌తో చిన్న వ్యాపారుల పొట్ట కొడుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. చికెన్ ధరలు పెరిగినప్పుడల్లా వినియోగదారుల నుంచి విమర్శలు ఎదుర్కొనేది తామేనని, కానీ అసలైన లాభం మాత్రం పెద్ద కంపెనీలకే వెళ్తోందని రిటైలర్లు వాదిస్తున్నారు. ఈ మార్జిన్ పెంచే వరకు షాపులు తెరిచే ప్రసక్తే లేదని వారు భీష్మించుకుని కూర్చున్నారు. సమ్మె కారణంగా ఒక్క హైదరాబాద్‌లోనే రోజుకు సుమారు రూ. 10 కోట్ల నుండి రూ. 15 కోట్ల వరకు వ్యాపారం దెబ్బతింటుందని అంచనా. కేవలం మాంసం విక్రయాలే కాకుండా, చికెన్‌పై ఆధారపడిన హోటళ్లు, రెస్టారెంట్లు ,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై కూడా ఈ ప్రభావం తీవ్రంగా పడింది. హోటల్ యజమానులు అధిక ధర చెల్లించి బయటి జిల్లాల నుండి చికెన్ తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందిఈ సమ్మె ఎంతకాలం కొనసాగుతుందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. కంపెనీ ప్రతినిధులు , రిటైలర్ల మధ్య చర్చలు జరుగుతున్నప్పటికీ, మార్జిన్ పెంపు విషయంలో ఇంకా ఒక స్పష్టత రాలేదు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ వివాదాన్ని పరిష్కరించాలని అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు కోరుతున్నారు. ఒకవేళ చర్చలు విఫలమైతే, ఈ సమ్మె మరింత కాలం కొనసాగే అవకాశం ఉంది.

# డిగ్రీ కాలేజీల అడ్డగోలు దందా

హైదరాబాద్, ఏప్రిల్ 2, హైదరాబాద్‌లో కొత్త డిగ్రీ కాలేజీల ఏర్పాటు అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కనీస నిబంధనలు పాటించకుండా, ఏ ఒక్క యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు లేకుండానే నగరంలో 11 బ్రాంచ్‌లు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో ఏదైనా కొత్త కాలేజీని ఏర్పాటు చేయాలంటే గుర్తింపు పొందిన వర్సిటీ అనుబంధ గుర్తింపు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అనుమతి తప్పనిసరిగా ఉండాలి. కానీ ముందస్తు అనుమతులు, కనీసం వర్సిటీల అనుబంధ గుర్తింపు(అఫిలియేషన్) లేకుండానే కొన్ని విద్యాసంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించడం ఏంటనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్త డిగ్రీ కాలేజీలకు సంబంధించి ఒక ప్రముఖ కాలేజీ పేరుతో హైదరాబాద్‌లోని మణికొండ, కూకట్ పల్లి, సనత్ నగర్, సంతోష్ నగర్, మియాపూర్, నారాయణగూడ, సికింద్రాబాద్, దిల్‌సుఖ్ నగర్, బోయిన్ పల్లి, హబ్సిగూడ, లింగంపల్లిలలో బ్రాంచీలను ఏర్పాటుచేయబోతున్నట్టు తెలిసింది. కాగా, ఈ కాలేజీలు కొత్తగా ఏర్పాటు అవుతున్నవి కావని, కన్వర్షన్ కింద అడ్మిషన్లు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కన్వర్షన్ చేసుకున్నా ప్రభుత్వం నుండి కన్వర్షన్ అనుమతి తీసుకున్నట్లు అధికారిక ప్రకటన లేకుండా ఎలా అడ్మిషన్ల ప్రక్రియ, ప్రచార కార్యక్రమాలు చేపడతారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నగరంలో కొత్తగా ఏర్పాటవుతున్న ఈ కాలేజీలు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక ప్రజాప్రతినిధికి చెందినవిగా తెలుస్తోంది. హైదరాబాద్‌లోని కొన్ని ప్రైవేటు డిగ్రీల కాలేజీలను తీసుకుని తమ కాలేజీ పేరుతో నడిపించుకునేందుకు రంగం సిద్ధం చేశారు. దీనికి సంబంధించి ఇప్పటికే హోర్డింగులు, ప్రకటనలతో భారీ ఎత్తున అడ్మిషన్ల ప్రచారం చేపట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఒక కాలేజీకి యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు తప్పనిసరి అవసరం. కానీ అఫిలియేషన్ ప్రక్రియను పక్కనపెట్టి ముందస్తుగానే అడ్మిషన్లు చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు అడ్మిషన్లు సైతం తీసుకుంటున్నట్లు సమాచారం. కాగా, ఈ కాలేజీ దోస్త్ పరిధిలో లేకుండా అడ్మిషన్లు చేపడుతున్నట్లు అధికారిక వర్గాల సమాచారం.నిబంధనలను పక్కన పెట్టి, ధనార్జనే ధ్యేయంగా, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులతో కాకుండా ఇష్టారీతిన ఫీజులు పెంచుకుంటూ అడ్మిషన్లు చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా రాష్ట్రంలో ఏదైనా కొత్త డిగ్రీ కాలేజీ ప్రారంభించాలంటే ఉన్నత విద్యా మండలి అనుమతితో పాటు, స్థానిక యూనివర్సిటీ ఉస్మానియా లేదా జేఎన్టీయూ వంటి వాటి నుంచి అఫిలియేషన్ తప్పనిసరి. కానీ, ఈ కొత్త కాలేజీలకు ఇప్పటివరకు ఏ ఒక్క యూనివర్సిటీ నుంచి కూడా గుర్తింపు లేదని తెలుస్తోంది.అఫిలియేషన్ లేకుండానే కాలేజీలు లాంచ్ చేయబోతున్నారన్న సమాచారంతో ఇప్పటికే ఆయా కాలేజీలపై సీఎంవోకు, ఉన్నత విద్యామండలికి ఫిర్యాదులు అందినట్లు సమాచారం. యూనివర్సిటీ అఫలియేషన్లు లేకుండానే కాలేజీలో అడ్మిషన్లను జోరుగా నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై సీఎంఓ, ఉన్నతవిద్యామండలిలో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అనుమతి లేకుండా అడ్మిషన్లు చేపడితే విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, కాలేజీ యాజమాన్యాల తీరులో మార్పు రావడం లేదని పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# కాంట్రవర్శీకి కేరాఫ్ గా అనిరుధ్ రెడ్డి

మహబూబ్ నగర్, ఏప్రిల్ 2, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేరు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. అసెంబ్లీ లోపల, బయట ఆయన చేసే వ్యాఖ్యలు వరుస వివాదాలు సృష్టిస్తున్నాయి. ఒక వివాదం సద్దుమనగక ముందే మరో వివాదాస్పద వ్యాఖ్య చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. సినిమా స్టైల్ డైలాగులు, విప్ప సారా కావాలంటూ ప్రతిపాదనలు, అక్రమ కట్టడాలపై విమర్శలు అధిష్టానానికి తలనొప్పిగా మారుతున్నాయా లేక పార్టీకి అస్త్రాలవుతున్నాయా అన్న చర్చ మొదలైంది.సినిమా స్టార్స్‌కి డ్రగ్స్ టెస్ట్ చేయాలన్న అంశంపై అనిరుద్ రెడ్డి తాజా వ్యాఖ్య మరోసారి షేక్ చేస్తోంది. సినీ నటులకు భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంటుంది. హీరోల ప్యాంటు జేబులు లెక్కపెట్టే ఫ్యాన్స్ ఉన్న దేశం ఇది. వాళ్లేం చేస్తే తామూ అది చేయాలనుకుంటారు. అందుకే వాళ్ళు అందరికీ ఆదర్శంగా నిలిచేలా డ్రగ్స్ తీసుకోలేదని సర్టిఫికేట్ తెస్తేనే సినిమా రిలీజ్ చేయాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు టాలీవుడ్‌లో ప్రకంపనలు సృష్టించాయి. ఇది సినీ నటులను కించపరచడమే.. వారిపై అనుమానాలు కలిగించడమే అంటు సినీ ప్రముఖులు స్పందిస్తున్నారు. కేవలం హీరోలే ఎందుకు, రాజకీయ నాయకులకూ ఇలాంటి పరీక్ష పెట్టే ఎన్నికల పోటీకి అనుమతించాలని మంచు విష్ణు కౌంటర్ ఇచ్చినా, అనిరుధ్ మాత్రం వెనక్కి తగ్గలేదు.ఇప్ప సారా తెలంగాణ టెకిలా అంటూ అసెంబ్లీలో ఆయన చెప్పిన మాటలు సభ్యులనే ఆశ్చర్యపరిచాయి. ఇప్ప సారా తాగితే 100 ఏళ్లు బతుకుతారు, ప్రభుత్వమే ఇప్ప సారా తయారీ చేయాలి అంటూ ప్రభుత్వానికి సలహా కూడా ఇచ్చారు. ఇది గిరిజన సంస్కృతికి మద్దతా లేక మద్యం పాలసీపై సెటైరా అర్థం కాక విపక్షాలు బిత్తరపోయాయి. కొందరైతే ప్రభుత్వం మళ్లీ మద్యం తయారీ రంగంలోకి దిగాలనుకుంటోంది అందుకే అనిరుద్ రెడ్డి నోటి ద్వారా ఇలాంటి కామెంట్స్ చేయించి ప్రజల స్పందన చెక్ చేస్తోందన్న విమర్శా చేస్తున్నారు. కోనసీమ జిల్లాల కొబ్బరిచెట్లపై తెలంగాణ ప్రజల దిష్టి తగిలి మాడిపోత్తున్నాయన్న పవన్ కల్యాణ్‌పై అనిరుద్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ఒకసారి కాదు పదే పదే పవన్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొడుతూ.."ఇక్కడ ఉండటం ఇష్టం లేకపోతే విజయవాడ వెళ్ళిపో" అని చేసిన విమర్శలు సోషల్ మీడియాలో యుద్ధానికి దారితీశాయి. పవన్ ఫ్యాన్స్ రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యే తీరుపై నొచ్చుకున్నారు. ఓ ఆరు నెలల క్రితం కూడా హైదరాబాద్‌లో బిల్డింగ్ పర్మిషన్లు, మున్సిపల్ అధికారుల అవినీతిపై సొంత ప్రభుత్వంపైనే పరోక్షంగా ఒత్తిడి పెంచుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు పాలనలో పారదర్శకత కోసమా? లేక అసంతృప్తినా? అన్న అనుమానం కలిగిస్తున్నాయి. హైదరాబాద్‌లో నిబంధనల పర్యవేక్షణ లేదు అవినీతి పెరిగిపోతోందని ఆయన వ్యాఖ్యలు ప్రభుత్వాన్నీ పరోక్షంగా ఇరుకున పెట్టాయి. ఏకంగా సీఎం కార్యాలయంపై వేలెత్తి చూపే అకాశమిచ్చాయి కూడా. ఇలా వరుస కాంట్రవర్శియల్ కామెంట్స్ చేసే అనిరుధ్ రెడ్డిని ప్రభుత్వం ఒక 'టూల్'లా వాడుకుంటోందా? అనే చర్చా సాగుతోంది. ఏదైనా కీలక నిర్ణయం తీసుకునే ముందు ప్రజల స్పందన ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి అనిరుధ్ లాంటి 'బోల్డ్'నాయకులతో ఇలాంటి వ్యాఖ్యలు చేయిస్తుండవచ్చు. దీనికి కైట్ ఫ్లయింగ్ అనే పరిభాషకూడా వుంది. రాజకీయ వాతావరణం అనుకూలంగా ఉందా లేక ప్రతికూలంగా ఉందా తెలుసుకునేందుకు ఇలాంటి నోటి దురుసు నాయకులను ప్రభుత్వం వాడుకుంటుంది. డ్రగ్స్ కంట్రోల్ లేదా మద్యం పాలసీలో మార్పుల వంటి వివాదాస్పద వ్యాఖ్యలు అందుకు నిదర్శనం అంటున్నారు. రేవంత్ రెడ్డికి అండగా ఉంటూనే, ప్రత్యర్థులపై ఎదురుదాడికి అనిరుధ్ రెడ్డి లాంటి నాయకులు మంచి టూల్ అవుతారు. ఒక్కోసారి అనిరుధ్ మాటలు పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపుతున్నాయి. కానీ, అప్పుడప్పుడు ఆయన చేసే అతి వ్యాఖ్యలు మిత్రపక్షాలనో లేదా తటస్థ వర్గాలనో ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది. అయితే, ప్రస్తుతం రేవంత్ రెడ్డి టీంలో అనిరుధ్ ఒక కీలకమైన స్ట్రాటజిక్ ప్లేయర్ అన్నది కాదనలేని నిజం. చివరిగా.. అనిరుధ్ రెడ్డి మాటలు గాలిలో పేలే బుడగలా? లేక లక్ష్యాన్ని ఛేదించే తూటాలా? అన్నది ముందు ముందు తేలనుంది. కానీ ప్రస్తుతానికి మాత్రం ఆయన తెలంగాణ రాజకీయాల్లో నోటికి పని చెప్పే ఎమ్మెల్యేగా గుర్తింపు తెచ్చుకున్నారు.

# ఒరాకిల్ లో ఏం జరుగుతోంది




హైదరాబాద్, ఏప్రిల్ 2, టెక్ దిగ్గజం ఒరాకిల్ ఒకేసారి 30 వేల మంది ఉద్యోగులపై వేటు వేయడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఉచకోత రాబోయే రోజుల్లోనూ కొనసాగనున్నాయని సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామం ఇప్పుడు భారతదేశంలోని టెక్ హబ్‌లలో కొత్త భయాందోళనలు రేకెత్తిస్తోంది. కంపెనీలు అనుసరిస్తున్న లేఆఫ్ ల కారణంగా ఐటీ నిపుణులు తమ భారీ పెట్టుబడులను పున:సమీక్షించుకుంటున్నారని తద్వారా రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్ర ప్రభావం పడబోతున్నట్లు బిజినెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.రెండు దశాబ్దాలుగా భారత్‌లో నెక్స్ట్ లెవల్ గా దూసుకుపోయిన భారత ఐటీ సెక్టార్ వృద్ధి వేగంగా ఇటీవల నెలకొన్న పరిణామలతో తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ఒరాకిల్ ఇండియా తరహా పరిణామాలు ఇతర కంపెనీల్లోనూ కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే దేశంలోని ఐటీ నగరాలపై తీవ్ర ప్రభావం పడబోతున్నట్లు తెలుస్తోంది. ఐటీ రంగంలో వచ్చిన ఆదాయం ప్రధానంగా బెంగళూరు, హైదరాబాద్ , పూణే, ఎన్ సీఆర్ నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం బలపడటాని వెన్నెముకగా నిలిచింది. కానీ తాజా లే ఆఫ్ లతో ఈ పరిస్థితులు తారుమారు అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో భారీ ధరలు పెట్టి ఫ్లాట్లు కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు.. ఇప్పుడు తమ ఈఎంఐలను చెల్లించేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇక ఉద్యోగాల్లో కొనసాగుతున్న వారు రేపు తమకు కూడా ఇదే పరిస్థితి రావొచ్చనే భయంతో తమ నిర్ణయాలను వాయిదా వేసుకునే అవకాశాలు ఉండనుంది.ఐటీ రంగంలో వస్తున్న పెనుమార్పులు ఇప్పుడు సామాన్యుడి సొంతింటి కలపై కోలుకోలేని దెబ్బ తీస్తుండగా ఏఐ ప్రభావం ఐటీ రంగాన్ని మరింత ఆందోళనలోకి నెట్టుతోంది. ఆటోమేషన్ వల్ల ఐటీ కంపెనీల రాబడిలో 2 నుంచి 3 శాతం తగ్గుదల ఉండవచ్చని ఐసీఐసీఐ డైరెక్ట్ అంచనా వేసింది. 2026లో ఇప్పటివరకు నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 25 శాతం పడిపోయింది. గతంలో అమెరికా డెవలపర్ల కంటే భారతీయ డెవలపర్లు తక్కువ శాలరీలకే లభిస్తారనే ఆలోచనలతో ఐటీ కంపెనీలు నడిచాయి. కానీ ఇప్పుడు ఎఐ కోడింగ్ ఏజెంట్లు విద్యుత్ ఖర్చుతోనే పని పూర్తి చేస్తున్నాయి. దీనివల్ల టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి దిగ్గజాలకు ముప్పు పొంచి ఉందని 'సిట్రిని రీసెర్చ్' నివేదిక హెచ్చరించింది. దీంతో రాబోయే రోజుల్లో ఐటీ సెక్టార్ ఎలా ఉండబోతోంది? తద్వారా ఆ రంగంలోని ప్రభావం ఇతర రంగాలపై ఎలా పడబోతోంది అనేది ఉత్కంఠ రేపుతోంది.

# మూడు కార్పొరేషన్ల పాలన ప్రారంభం

హైదరాబాద్, ఏప్రిల్ 2, హైదరాబాద్ మహానగర పరిధిలో వికేంద్రీకృత నగర పాలనను బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) పరిధిని మూడు మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తూ ఫిబ్రవరి 11వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మార్చి 31 వరకు ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చులు, బిల్లుల చెల్లింపు వంటి అంశాలను జీహెచ్ఎంసీ ద్వారానే నిర్వహించారు. అయితే 2026–27 కొత్త ఆర్థిక సంవత్సరం నేటి ప్రారంభం కావడంతో ఎవరికివారే పరిపాలన ప్రారంభించనున్నారు. ఆదాయం, ఖర్చులను సైతం ఎక్కడికక్కడే నిర్వహించనున్నారు.తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) పరిధిలోని 2,053 చదరపు కిలోమీటర్ల పరిధిని ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)లను ఏర్పాటు చేసింది. మూడు కార్పొరేషన్ల విభజనలో భాగంగా 689 చదరపు కిలోమీటర్లతో 150 వార్డులతో కూడిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ని ఏర్పాటు చేశారు. 70 లక్షల జనాభా ఉందని అధికారులు చెబుతున్నారు.ఖైరతాబాద్, సికింద్రాబాద్, చార్మినార్, రాజేంద్రనగర్, గోల్కొండ, శంషాబాద్ జోన్లు ఉన్నాయి. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లలోని 16 సర్కిళ్లు, 76 వార్డులతో కూడిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)గా ఏర్పాటు చేశారు. ఈ కార్పొరేషన్ 613 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. 31.11 లక్షల జనాభా ఉంది. మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్లలోని 14 సర్కిళ్లు, 74 వార్డులతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)గా ఏర్పాటు చేశారు. 654 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 32.52 లక్షల జనాభా ఉందని అధికారులు గుర్తించారు.జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో సుమారు 25 లక్షల ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. వీటిలో సుమారు 20 లక్షల మంది మాత్రమే రెగ్యులర్‌గా ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లిస్తున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 31 మార్చి రాత్రి 9 గంటల వరకు రూ.2,501 కోట్ల ఆస్తి పన్ను వసూలైనట్లు అధికారులు తెలిపారు. మరో రూ.50 కోట్లు వచ్చే అవకాశముందని అధికారుల అంచనా వేస్తున్నారు. మొత్తం రూ.2,550 కోట్లకు పైగా ప్రాపర్టీ ట్యాక్స్ వసూలయ్యే అవకాశం ఉందని అధికారులు లెక్కలు వేసుకుంటున్నారు. బుధవారం నుంచి వసూలయ్యే ఎర్లీబర్డ్ స్కీమ్ ట్యాక్స్ వేర్వేరుగా వసూలు చేయనున్నారు.ప్రాపర్టీ ట్యాక్స్ సంబంధించి 2026–27 సంవత్సరానికి ముందస్తుగా చెల్లించి ఎర్లీబర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, సీఎంసీ కమిషనర్ సృజన, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కోరారు. ఏప్రిల్ నెలలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026?27)కి సంబంధించిన మొత్తం ప్రాపర్టీ టాక్స్‌ను ముందుగానే చెల్లించే వారికి 5 శాతం రాయితీ లభించనుందన్నారు. గత సంవత్సరాల బకాయిలపై ఈ రాయితీ వర్తించదన్నారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా రూ.548 కోట్లు వసూలయ్యాయి.

# తెలంగాణలో భక్తి ఫైట్....

హైదరాబాద్, ఏప్రిల్ 2, తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు ఏ లెవల్‌కు వెళ్లాయంటే.. రేపు పొద్దున ఓటర్లు కూడా ఓటు వేసే ముందు ఏ దేవుడిని నమ్ముతున్నారో చూసుకుని బటన్ నొక్కాల్సి వస్తుందేమో! గత పదేళ్లుగా మన రాష్ట్రాన్ని ఏలిన "వైష్ణవ ప్రియుడు" కేసీఆర్ గారు యాదాద్రిలో నరసింహస్వామిని కోట్లు ఖర్చు పెట్టి కోవెల కట్టిస్తే.. ఇప్పుడు వచ్చిన మన "శివ భక్త" రేవంత్ రెడ్డి గారు మాత్రం "మీరు చక్రం తిప్పితే.. నేను త్రిశూలం తిప్పుతా" అంటూ శైవ నామాలతో రంగంలోకి దిగారు.ఇన్నాళ్లూ కేసీఆర్ గారు చినజీయర్ స్వామి సూచనలతో, ఆగమ శాస్త్రాల లెక్కలతో.. ఎక్కడ చూసినా 'గోవిందా గోవిందా' అనిపించారు. కానీ భద్రాచలం రామయ్యను మాత్రం ఎందుకో కాస్త లైట్ తీసుకున్నారు. అక్కడే మన రేవంత్ అన్నకు రూట్ దొరికింది. "కేసీఆర్ గారు రాముడిని మర్చిపోతే.. నేను రాముడికి పట్టువస్త్రాలు ఇస్తూనే, శివుడితో సెల్ఫీలు దిగుతా" అన్నట్లుగా ఆయన ప్లాన్ మార్చేశారు.ఢిల్లీలో రాహుల్ గాంధీ గారు అప్పుడప్పుడు "నేను శివ భక్తుడిని" అని ఫోజులు ఇస్తుంటే ఇక్కడ రేవంత్ రెడ్డి గారు ఆ లైన్ గట్టిగా పట్టేశారు. కేసీఆర్ వేములవాడ రాజన్నకు రూ. 100 కోట్లు ఇస్తానని చెప్పి 'సారీ.. మర్చిపోయా' అంటే.. రేవంత్ రెడ్డి గారు మాత్రం "రాజన్నకు నిధులిస్తా.. మూసీ గట్టున వంద అడుగుల శివుడిని నిలబెడతా" అని శివతాండవం చేస్తున్నారు. మొత్తానికి పాత పాలనలో 'విష్ణువు' హైలైట్ అయితే కొత్త పాలనలో 'పరమశివుడు' ట్రెండింగ్‌లో ఉన్నారన్నమాట!అసలు ఇక్కడ డౌట్ ఏంటంటే.. వీరికి భక్తి పెరిగిందా? లేక దేవుళ్లని కూడా విభజించి ఓట్లు దండుకోవాలని ఉందా? కేసీఆర్ మార్క్ భారీ గోపురాలు, శిల్ప కళలు, వైష్ణవ ఆడంబరం కనిపిస్తోంది. ఇక రేవంత్ మార్క్ సాదాసీదా శివ భక్తి, శైవ క్షేత్రాల డెవలప్‌మెంట్, 'జై భోలో' నినాదాలు వినిపిస్తున్నాయి.ఒకరు గాలిలో చక్రం తిప్పాలని చూస్తే, మరొకరు నిప్పు కన్ను తెరుస్తానని హింట్లు ఇస్తున్నారు. కానీ పాపం జనం మాత్రం.. "అయ్యా.. మీరు వైష్ణవమో, శైవమో మాకు అనవసరం.. మాకు కొంచెం వర్షాలు కురిపించి, రోడ్లు వేయించి, మా బతుకులు బాగు చేస్తే ఏ దేవుడైనా ఒక్కటే!" అని ముక్కున వేలేసుకుంటున్నారు.రాజకీయ నాయకుల భక్తి ఎప్పుడూ 'సీజనల్' వ్యాధి లాంటిదే. ఎన్నికలప్పుడు గుళ్లు తిరగడం కామన్, కానీ ఇలా 'శాఖల' వారీగా దేవుళ్లను పంచుకోవడం మాత్రం విచిత్రం. కేసీఆర్ గారు వైష్ణవంతో 'మోక్షం' పొందాలనుకుంటే, రేవంత్ రెడ్డి గారు శైవంతో 'శక్తి'ని ప్రదర్శిస్తున్నారు. రేపు ఇంకెవరైనా వచ్చి "మేము శాక్తేయులం" అని అమ్మవారిని పట్టుకొస్తారో ఏమో!చివరికి ఏ దేవుడు కరుణిస్తాడో కానీ.. తెలంగాణ ఓటర్లు మాత్రం ఈ "ఆధ్యాత్మిక వార్" చూసి తెగ ఎంజాయ్ చేస్తున్నారు!

# కిడ్నాప్ కేసులో మరో నలుగురు అరెస్ట్




తిరుపతి విద్యార్థి నేతల కిడ్నాప్ వ్యవహారంలో మోహన్ బాబు యూనివర్సిటీ యాజమాన్యం సిబ్బందిపై తిరుచానూరు పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే 13 మందిని అరెస్టు చేయగా విచారణలో మరో నలుగురిని బుధవారం రాత్రి అరెస్ట్ చేశారు. మధు, కిరణ్ కుమార్ రెడ్డి, హరికృష్ణ, కిషోర్ లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

# ప్రజల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వ పథకాల అమలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 02 :** ప్రజల సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.ప్రభుత్వం గురువారం రోజు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన గ్రామ సభ/వార్డు సభల నిర్వహణలో భాగంగా జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుచరిత, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ లతో కలిసి హాజరై 99 రోజుల కార్యచరణ ప్రణాళిక సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు ఫలాలు అందించే విధంగా కృషి చేస్తుందని తెలిపారు.జిల్లాలోని 306 గ్రామపంచాయతీలలో గ్రామసభలు జరిగాయని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులు,బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులు, మందమర్రి మున్సిపల్ పరిధిలోని 24 వార్డులు,లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ లలో వార్డు సభలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.అర్హత కలిగిన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించి చౌక ధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని,ఇందు కొరకు ప్రభుత్వం 13వేల కోట్ల రూపాయల ఖర్చు చేసిందని తెలిపారు.ఈ నెలలో 3 నెలల రేషన్ బియ్యం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించి రాష్ట్రమంతట మహిళలు ఉచితంగా ప్రయాణించేలా అవకాశం కల్పించడం జరిగిందని, తద్వారా ఇప్పటి వరకు 10 వేలకోట్ల రూపాయలు మహిళలకు ఆదా అయ్యాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి కొరకు వడ్డీలేని రుణాలు కల్పించి వివిధ వ్యాపార రంగాలలో ప్రోత్సహించడం జరుగుతుందని, రుణం పొందిన సంఘాల సభ్యులు సకాలంలో తిరిగి చెల్లించి మళ్లీ రుణం పొందవచ్చని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు భాగస్వామ్యం కల్పించడం జరిగిందని, విద్యార్థుల ఏకరూప దుస్తులు తయారుచేసే అవకాశం కల్పించడం జరిగింది.తెలిపారు. రైతులకు 2 లక్షల లోపు రుణమాఫీ కల్పించి రైతు భరోసా పథకం ద్వారా సంవత్సరానికి ఎకరానికి 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళలను కుటుంబ పెద్దగా గుర్తించి గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని,అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లయితే పరిశీలించి పథకం వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది నూతన లబ్ధిదారులకు పింఛన్లు అందించడం జరుగుతుందని,ఇందులో భాగంగా జిల్లాలోని దాదాపు 6 వేల నుండి 7 వేలమంది లబ్ధిదారులకు పింఛన్లు అందుతాయని, దివ్యాంగుల పింఛన్ల మంజూరులో దివ్యాంగత్వ పరీక్షల ధ్రువపత్రం ఆధారంగా అర్హులైన వారికి అందించడం జరుగుతుందని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించడం జరుగుతుందని,దాదాపు 3 వేల ఇండ్లు స్లాబ్ స్థాయికి చేరుకున్నాయని, 300 ఇండ్లు పూర్తి చేయబడి బిల్లులు మంజూరు చేయడం జరిగిందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేసే చర్యలలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలలో అల్పాహార పథకం కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ వరకు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.అర్హత గల దివ్యాంగులకు మోటారు సైకిళ్ళు అందించేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. భూసారాన్నిబట్టి పంట మార్పిడి విధానాన్ని అమలుచేసి ఆర్థికంగా లబ్ధి పొందే విధంగా రైతులకు అవగాహన కల్పించి ఆయిల్ పామ్, కూరగాయలు, ఉద్యానవన పంటల సాగుపై వివరించడం జరుగుతుందని తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనుల నిర్వహణ,పారిశుద్ధ్య అమలు,త్రాగునీటి సరఫరా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు.పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టడం ద్వారా సీజనల్, అంటు వ్యాధులను నియంత్రించి ప్రజల ఆరోగ్య ప్రమాణాలను పెంపొందించవచ్చని తెలిపారు.వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి సమస్యలు లేకుండా చెన్నూర్ ప్రాంతంలో బోర్ వెల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.రాష్ట్ర ప్రజలకు కుటుంబ భీమా అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టు వై. నాగరాజు సేవలు అమోఘం

**సమాజాభివృద్ధికి నిరంతరం కృషి చేసిన జర్నలిస్ట్ వై. నాగరాజు**

**సామాన్య ప్రజల కోసం ఎనలేని సేవలందించారు**

**జర్నలిస్టులకు వై. నాగరాజు మార్గదర్శి**

**నిలువుటద్దం పత్రిక సమాజ హితం కోసం పనిచేస్తుంది**

**టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్**

కార్యక్రమానికి హాజరైన మిరియాల రాఘవరావు, గాలి బాలాజీ, పిఎస్ఆర్కే భగవాన్, హెచ్ఎం మూర్తి, కాంగ్రెస్ నేతలు సుదర్శన్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, పుష్ప రెడ్డి, ఫణి.

సమాజ అభివృద్ధికి సీనియర్ జర్నలిస్ట్ వై. నాగరాజు ఎనలేని సేవలందించారని టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. హైదరాబాదులో సీనియర్ జర్నలిస్ట్ వై. నాగరాజు ప్రథమ వర్ధంతి జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన బండి రమేష్ మాట్లాడుతూ సమాజంలో ఫోర్త్ ఎస్టేట్ గా కొనసాగుతున్న జర్నలిజం లో జర్నలిస్టుగా పనిచేసిన వై నాగరాజు తన కలం ద్వారా ఎన్నో అన్యాయాలు, అక్రమాలను వెలికి తీసారని సమాజ హితం కోసం ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. సామాన్య ప్రజల కోసం ప్రజలకు ప్రభుత్వానికి వారిదిగా ఉండి నిరుపేదలు అభివృద్ధి చెందడానికి ఆయన చేసిన కృషి ఎంతో గొప్పది అన్నారు. ప్రశ్నించే గొంతుకగా ఉండి అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టించిన జర్నలిస్టు వై నాగరాజు అని చెప్పక తప్పదన్నారు. సుమారు 25 సంవత్సరాల క్రితం నిలువుటద్దం అనే పత్రికను ప్రారంభించి సమాజానికి ఎంతో సేవలు అందించిన ఘనత వై. నాగరాజు ది అని అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాలి బాలాజీ మాట్లాడుతూ వై నాగరాజు జర్నలిస్టుగా సమాజానికి సేవలు అందిస్తూనే నిరుపేదల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. వై నాగరాజు లేని లోటు తీర్చలేనిదని ఆయన ఆశించిన ఆశయ సాధన కోసం నిలవడం పత్రికను వారి కుటుంబ సభ్యులు కొనసాగిస్తూ సేవలందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో వై నాగరాజు సతీమణి వై రమాదేవి, వై మౌనిక, సీనియర్ జర్నలిస్టులు విద్య వెంకట్, రాజిరెడ్డి, శైలజ, జ్యోతి, ఉష, ఉమా, లావణ్య, రాజు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



# బస్సులో పోగొట్టుకున్న నగలు నగదు బ్యాగ్ అందజేత



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 02** లక్షెట్టిపేట పోలీసులు బస్సులో ఒక మహిళ తన బ్యాగును మరిచిపోగా అట్టి బ్యాగును గుర్తించి పోగొట్టుకున్న మహిళకు అందించినారు. వివరాల్లోకి వెళితే గొల్లపల్లి మండలం ధనురుకు చెందిన కొల్లూరి భాగ్యలక్ష్మి అనే మహిళ పని నిమిత్తం ఉట్నూరు వెళ్ళింది. అక్కడ పని ముగించుకొని తిరిగి అదిలాబాద్ నుండి మంచిర్యాల వెళ్లే ఆదిలాబాద్ డిపో బస్సు ఎక్కి లక్షెట్టిపేట బస్టాండ్ లో దిగింది. ఆమె దిగిన తర్వాత తన బ్యాగ్ బస్సులోనే మరిచిపోవడంతో వెంటనే లక్షెటిపేట పోలీసులకు సమాచారం అందజేసింది. లక్షెట్టిపేట బ్లూ కోర్టు విధులు నిర్వహిస్తున్న ఎంబడి సత్యనారాయణ,రాజేందర్ లు వెంటనే బస్టాండ్ చేరుకొని బస్సు వివరాలు సేకరించి మంచిర్యాల డిపో మేనేజర్ మాట్లాడి మహిళా మరిచిపోయిన బ్యాగును తిరిగి తెప్పించి బాధితురాలికి అప్పగించారు.పోగొట్టుకున్న మహిళ బ్యాగులో బంగారంతో పాటు నగదు కూడా ఉండడంతో తిరిగి తనయి తాను పొందడంతో ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసుల సేవల పట్ల బాధితురాలు సంతోషం వ్యక్తం చేసింది.

# హనుమాన్ ఆలయానికి పోటెత్తిన భక్తులు

సికింద్రాబాద్.. తాడ్బండ్ దేవాలయ కార్యనిర్వాహణాధికారి నరేందర్ ఆధ్వర్యంలోహనుమాన్ జయంతి పురస్కరించుకుని తాడ్బండ్ హనుమాన్ దేవాలయంలో స్వామివారికి ఉదయం నుండి ప్రత్యేక పూజలు అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున నుండి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి తాడ్బండ్ వీరాంజనేయ స్వామిని దర్శించుకున్నారు.ప్రత్యేక పూజలు అభిషేకాలు హనుమాన్ చాలీసా పారాయణాలతో తాడ్ బండ్ హనుమాన్ దేవాలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా వివిధ రకాల పండ్లు, పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి అనుమతి ఇస్తున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా తాడ్బండ ప్రాంతమంతా జైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగుతుంది.ఆలయ పరిసర ప్రాంతాలలో రామలక్ష్మణుల సమేత హనుమంతుడి విశేష అలంకరణ తో పాటు విద్యుత్ దీపాల వెలుగులు అందరినీ ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి.. రకరకాల సెట్టింగులతో కూడిన విద్యుత్ దీపాల కాంతులతో తాడ్బండ్ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణం మెరిసిపోతోంది.హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి లు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 02 :** మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరు ఆచరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 317వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి.చంద్రయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, బి.సి.సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తురుష్క సైనికులకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేశారని,రాజ్యాధికార సాధనపై ప్రజలలో చైతన్యం కలిగించారని,బానిస ప్రజల సంక్షేమం కోసం పోరాడారని తెలిపారు.మహనీయుల చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చడం ద్వారా భావితరాలకు అందించవచ్చని తెలిపారు.ప్రభుత్వం మహనీయుల వర్ధంతి, జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా శాఖల అధికారులు,బి సి సమాజ్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి ఎన్. శ్రీనివాస్,బి.సి.సంఘాల ప్రతినిధి కె.లచ్చన్న, గౌడ సంఘం రాష్ట్ర ప్రతినిధి ముఖేష్ గౌడ్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ మైనారిటీ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 02 :** తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ మైనారిటీ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు.విదేశాలలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో మండల, జిల్లా స్థాయిలో అవగాహన శిబిరాలు నిర్వహించాలని,మున్సిపల్ కమిషనర్లు,మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఉపాధి అవకాశాల సమాచారాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని,కార్యాలయాల నోటీసు బోర్డులలో ప్రదర్శించాలని తెలిపారు.జిల్లా పౌర సంబంధాల శాఖ ద్వారా దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ఛానల్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని,విద్యాసంస్థల ప్రిన్సిపాల్ లు అర్హులైన విద్యార్థులకు,నిరుద్యోగ యువతకు సమాచారం అందించాలని తెలిపారు.

పలుదేశాలలో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను అర్హత గల మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.జర్మనీ దేశంలో నర్సింగ్,ఎలక్ట్రికల్/పవర్ లైన్ టెక్నీషియన్ ఉద్యోగాలు, ఖతర్- దోహా దేశంలో నర్సింగ్ ఉద్యోగాలు,గ్రీస్ దేశంలో హాస్పిటాలిటీ, హౌస్ కీపింగ్, వెయిటర్లు,బార్బెండర్లు,వంట మనుషులు,హోటల్ రిసెప్షనిస్ట్, స్పా థెరపిస్టులు,ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, లైఫ్ గార్డులు,గార్డెనర్లు, బెల్ బాయ్స్,ఫిషర్ మెన్ ఇతర ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.ఉద్యోగాల సంబంధిత విద్యార్హతలతో పాటు అభ్యర్థుల వయసు 21 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, ఇంగ్లీష్ భాష పరిజ్ఞానం కలిగి ఉండాలని,2,3 సంవత్సరాల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని,వసతి,ఆహారం, మెడికల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి అర్హత గల మైనారిటీ అభ్యర్థులు తమ బయోడేటా/సి వి ను వెంటనే,tomcomglobal@gmail.com,tomcom.resume@gmail.com లకు మెయిల్ చేయవచ్చని, ఇతర వివరాలకు 9440048590, 9440049937, 9440051452, 8919047600 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# మచిలీపట్నం 6వ డివిజన్ కొబ్బరి తోటలో కొనసాగుతున్న ఉద్రిక్తత

మచిలీపట్నం 6వ డివిజన్ కొబ్బరి తోటలో ఉద్రిక్తత కొనసాగింది. అనుమతులు లేవంటూ పడగొడుతున్న ఇంటిని పరిశీలించేందుకు మచిలీపట్నం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త పేర్ని కిట్టు వెళ్లారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన వైఎస్ఆర్సిపి ఇన్చార్జి పేర్ని కిట్టు ను పోలీసులు అడ్డుకున్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి చర్యలు మీరు చేయలేదా అంటూ రాజకీయ నాయకుడి మాదిరిగా వాదిస్తూ పరుష పదజాలం తో సీఐ పరమేశ్వర్ పేర్ని కిట్టు పై రెచ్చి పోయాడని కిట్టు ఆరోపించారు. . సీఐ ప్రవర్తన పై వైకాపా శ్రేణులు మండిపడ్డారు. కాకి చొక్కా వేసుకుని పసుపు పార్టీ నేతగా విధులు నిర్వహిస్తునవా అంటూ నిలదీసారు. ఇంటి కూల్చివేత పై అధికారులు ఆదేశాలను చూపాలంటూ కార్పొరేషన్ అధికారులను న పేర్ని కిట్టు నిలదీసారు. పొంతనలేని సమాధానాలను చెబుతూ మున్సిపల్ అధికారులు తప్పించుకునే ప్రయత్నాలు చేసారు. భారీ మిషనరీ తో ఇంటిని పూర్తిగా నేలమట్టం చేసారు.

## పేషంట్లకు మెరుగైన వైద్య సేవలందించాలి

## కూకట్పల్లి యూపీహెచ్‌సీని పరిశీలించిన కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 2:**ఎంతో నమ్మకంగా వచ్చే పేషంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు.

గురువారం కూకట్పల్లి లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎం అండ్ హెచ్ ఓ ఉమా గౌరి తో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు అంకితభావంతో పేషంట్లకు సేవలు అందించాలని, అన్ని వేళలలో వైద్యులు అందుబాటులో ఉండాలని అన్నారు. రోజుకు ఎంత మంది పేషంట్లు వస్తారని, వారి వివరాలను సంబంధిత రిజిష్టర్లలో నమోదు చేస్తున్నారా అని అడిగి రిజిష్టర్లను పరిశీలించారు. ఆసుపత్రిలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రికి కావలసిన మరమ్మత్తులు, ఇన్ ఫ్రాస్ట్రక్చర్, డెలివరీ టీమ్స్ వంటి సమస్యలను మెడికల్ ఆఫీసర్ కలెక్టర్ కు తెలుపగా, కలెక్టర్ స్పందిస్తూ అవసరమైన వాటికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. శానిటేషన్ వారితో సమన్వయం చేసుకుంటూ ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మందుల గదిని పరిశీలించి ఎక్స్పైరీ డేట్ పరిశీలించి మందులు అందించాలని సిబ్బందికి సూచించారు.

## పారాక్వాట్ పురుగుమందుపై 60 రోజుల పాటు నిషేధం జిల్లా వ్యవసాయ అధికారి కె. చంద్రకల

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 02:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పారాక్వాట్ మరియు దాని అనుబంధ రసాయన ఫార్ములేషన్ల అమ్మకాలు, నిల్వ, పంపిణీ, తయారీ మరియు వినియోగంపై తక్షణమే అమల్లోకి వచ్చే విధంగా 60 రోజుల పాటు నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ అధికారి కె. చంద్రకల ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ ఉత్తర్వుల (

G.No.24, తేది: 31.03.2026) ప్రకారం ఈ నిర్ణయానికి గల ముఖ్య కారణాలు

1. ప్రజా ఆరోగ్యం: ఈ రసాయనం వల్ల మనుషుల ఆరోగ్యంపై తీవ్రమైన దుష్ప్రభావాలు కలుగుతున్నట్లు వివిధ నివేదికలు స్పష్టం చేశాయి.
2. రైతుల రక్షణ: సాగు పనుల్లో భాగంగా ఈ పురుగుమందును వాడే రైతుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిషేధం విధించబడింది.
3. జంతువుల ఆరోగ్యం: పశువులకు మరియు ఇతర జంతువులకు కూడా ఈ రసాయనం వల్ల హాని జరుగుతున్నట్లు గుర్తించారు.

ముఖ్య గమనికలు:

1. చట్టపరమైన చర్యలు: ఇన్సెక్టిసైడ్స్ చట్టం, 1968 లోని సెక్షన్ 27 ప్రకారం ప్రభుత్వం ఈ అధికారాలను వినియోగించింది. ఎవరైనా ఈ నిబంధనలను అతిక్రమించి పారాక్వాట్ విక్రయించినా లేదా నిల్వ చేసినా వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
2. అమలు కాలం: ఈ నిషేధం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 60 రోజుల పాటు అమల్లో ఉంటుంది.

జిల్లాలోని ఎరువులు మరియు పురుగుమందుల డీలర్లు, తయారీదారులు మరియు రైతులు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం నిఘా ఉంచుతారని జిల్లా వ్యవసాయ అధికారి కె. చంద్రకల హెచ్చరించారు.

## ప్రజల సంక్షేమమే లక్ష్యం -- కొత్త పథకాలతో ముందుకు

## అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్




**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 2:**తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ప్రజల ఆకాంక్షలు, అవసరాలకనుగుణంగా వారిని అభివృద్ధి పథంలో నడిపేలా నూతన పథకాలను ఏర్పాటు చేస్తూ వారికి ఎంతో ఆర్థిక చేయూత నందిస్తుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు.

ప్రజా పాలన -ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలియాబాదు, ఎల్లంపేట మున్సిపాలిటిలలోని వార్డు సభలకు మున్సిపల్ ఛైర్మన్లు శిరీషరెడ్డి, శ్రీదేవి లతో కలిసి అదనపు కలెక్టర్ ఫైజాన్ ఆహ్మద్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా,మహాలక్ష్మి, ఉచిత బస్సుసౌకర్యం, ?500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారికి మరిన్ని కొత్త పథకాలను అందించాలనే సంకల్పంతో గ్రామ సభలను నిర్వహించుకుంటున్నామన్నారు. జూన్ 2 నుంచి అందరికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందించడం, ఇంటర్ కళాశాలల విద్యార్థులకు



కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు, దివ్యాంగులైన ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాల పంపిణీ వంటి కొత్త పథకాలను మన ప్రభుత్వం ప్రవేశపెడుతుందని అన్నారు. గ్రామ/వార్డు సభలలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా ప్రాధాన్యత క్రమంలో చర్యలు చేపడతామన్నారు.ఈ పథకాల ద్వారా లబ్ది పొందుతున్న వారు,ఈ పథకాల గురించి తెలియని వారికి మీరే ఈ పథకాల గురించి అవగాహన కల్పించి వారు కూడాఈ పథకాలను వినియోగించుకునేలా చూడాలన్నారు. దేశం మొత్తం లో కేవలం తెలంగాణ మరియు కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే మహిళల ప్రయాణం కోసం ఇలాంటి పథకాలు ఉన్నాయని, వీటిని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హత గల ప్రతి ఇంటికి చేరడమే ప్రభుత్వం లక్ష్యమని అందులో భాగంగానే గ్రామ/వార్డు సభలు ఏర్పాటు చేసి మిమ్మల్ని భాగస్వామ్యం చేయడంతో పాటు మీ మీ సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించడమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యమన్నారు. అంతకు ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించడం, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి వీడియోలను ప్రదర్శించడంతో పాటు సాంస్కృతిక కళాకారులు సంక్షేమ పథకాల పై పాటలు ఆలపించారు. అనంతరం లబ్దిదారులు వారి సమస్యలను అదనపు కలెక్టరు గారికి తెలియజేయగా వారు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారం త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకుంటున్న లబ్దిదారులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్లు, వైస్ ఛైర్మన్లు, సంబంధిత తహాసీల్దార్లు, నోడల్ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో ఘర్ వాపసీ

తిరుపతి టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నివాసం వద్ద హిందూమత పున:స్వీకరణ మహోత్సవం జరిగింది. తిరుపతి పి.కే.లేఅవుట్ చెందిన అబ్దుల్లా, అమీనా దంపతులు తిరిగి హిందూ మతంలోకి ఆహ్వానిస్తూ ప్రత్యేక హోమం జరిపించారు. 27 ఏళ్లుగా కువైట్ లో జీవనోపాధికి వెళ్ళి ఇస్లాం మతం స్వీకరించిన యాలమూరి శ్రీనివాసులు రెడ్డి, పుష్ప దంపతులు అబ్దుల్లా, అమీనగా పేరు మార్పు కున్నారు. ఇండియాకు 2015లో తిరిగి వచ్చిన ఈరోజు టిటిడి మాజీ చైర్మన్ భూమాన కరుణాకర్ రెడ్డి ప్రోత్సాహంతో హిందూ మతం స్వీకరించారు. పద్మావతి పురంలోని భూమన నివాసంలో ఈ హిందూమత పున:స్వీకరణ మహోత్సవం నిర్వహించారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం

## కార్పోరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ



**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 2 (ప్రజాబలం)** ఖమ్మం స్థానిక 46వ డివిజన్ జూబ్లీ క్లబ్ నందు ఈరోజు వార్డ్ సభ నిర్వహించడం జరిగింది. ఇట్టి సభలో కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ మాట్లాడుతూ గౌరవ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు గారి సహకారంతో తమ డివిజన్ పరిధిలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం లక్ష్యంగా పనిచేయడం జరుగుతుంది అని తెలిపారు. ఇంటింటికి సంక్షేమం చేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గుర్తు చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రజాపాలన కొనసాగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ఆరు గ్యారంటీలు తప్పక అమలు చేస్తామని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రిగారి సందేశం చదివి వినిపించారు. ఎలక్ట్రిసిటీ ఏఈ క్రాంతి సింహ గారు మాట్లాడుతూ ఖమ్మం కార్పొరేషన్ లోనే 46వ డివిజన్లో మొదటిగా విద్యుత్ పనులకు మున్సిపాలిటీ నుంచి డబ్బు చెల్లించడం జరిగిందని, అందరికన్నా ముందుగా ఈ డివిజన్లో ప్రజా అవసరాలకు తగ్గట్టుగా కార్పొరేటర్ గారు



పనిచేస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలనాధికారి షేక్ హైమద్, డివిజన్ ప్రత్యేక అధికారి సాయి, లైన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ డివిజన్ అధ్యక్షుడు షేక్ రజ్జి , నాయకులు బాణాల లక్ష్మణ్, తొగరు భాస్కర్, బాల్దే నాగేశ్వరరావు, కన్నం రమేష్, ఎమ్మె రామకృష్ణ, తుపాకుల మధు, మన్నె హరికృష్ణ, అంగన్వాడీ టీచర్లు, నగర దీపికలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## సర్దార్ పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 02:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం, జిల్లా కలెక్టర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గారి అనుమతితో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 02: ఈ రోజు ఉదయం 10.00 గంటలకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మీటింగ్ హాల్, అంతాయపల్లి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించబడినది.ఈ కార్యక్రమంలో శ్రీ ఫైజాన్ అహ్మద్, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ), మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జ్యోతి ప్రజ్వలన చేసి, శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్.ఎస్. చంద్రావతి, జిల్లా రెవెన్యూ అధికారి, మరియు టి. ఝాన్సీ రాణి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పాల్గొని, శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న సేవలను కొనియాడారు.అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం, జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో తేదీ 03-04-2026 నాడు ఉదయం 10.00 గంటలకు శ్రీ దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను జిల్లా కలెక్టర్ కార్యాలయం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించబడును.కావున మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, బి.సి. సంఘం నాయకులు, కురుమ కుల సంఘాల నాయకులు, వివిధ కులాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు మరియు జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనవి చేయబడుచున్నది అని తెలిపారు.

## చర్లపల్లిలో హనుమాన్ జయంతి పూజలు





**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 02 :**ఉప్పల్ నియోజకవర్గంలోని చర్లపల్లి డివిజన్‌లో గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ బీజేపీ అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి స్వామివారి ఆశీర్వాదాలు పొందారు.

అదేవిధంగా, చర్లపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో కూడా తాడూరి శ్రీనివాస్ పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ జయంతి వంటి పుణ్యదినాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమని, సమాజంలో సేవా భావం పెంపొందించాలని అన్నారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక గ్రామ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నజిల్లా కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేట ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక గ్రామ సభలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి పాల్గొన్నారుప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభను ఉద్దేశించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పంపించిన సందేశాన్ని గ్రామస్తులకు చదివి వినిపించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను వివరించి దుద్దెడ గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారుల వారిగా వివరించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, గృహజ్యోతి, మహాలక్ష్మి తదితర పథకాల లబ్దిదారులు వారి అనుభవాలను సభలో వివరించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించాలంటే సేంద్రియ వ్యవసాయానికి రైతులు ముందుకు రావాలని, పంట మార్పిడి విధానం పాటించాలని, గ్రామంలో కోతుల బెడదను నివారించాలని, అర్హత ఉన్న పేదవారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చేయూతనివ్వాలని గ్రామపంచాయతీలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, మరియు రాష్ట్ర స్థాయిలలో ఐదు అంచెలుగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని దానిలో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా 508 గ్రామపంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని మరియు ఐదు మున్సిపాలిటీలలో వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పేద ప్రజల అభివృద్ధి కోసం గ్రామాలు, పట్టణాలలో మౌలిక వసతులను కల్పించడమే కాకుండా మహాలక్ష్మి, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, మహిళ స్వయం సహాయ సంఘాలకు వడ్డీ లేని రుణాలు, రైతు భరోసా, రైతు బీమా తదితర ప్రాధాన్యత కార్యక్రమాలను అమలు చేయడమే కాకుండాఎదిగే వయసులో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతనంగా జూన్ నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం మరియు ప్రీ ప్రైమరీ స్కూల్ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహారం పథకం అమలు చేయడం జరుగుతుందని, ఇంటర్మీడియట్ చదివే దివ్యాంగుల విద్యార్థుల కొరకు వాహన సౌకర్యం కల్పించడం జరుగుతుందని, కుటుంబ జీవిత బీమా కార్యక్రమాన్ని అమలు చేయడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి, ఎంపీడీవో, గ్రామ ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాలలో చిన్నారుల బంగారు భవిష్యత్తు : రాష్ట్ర, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 2** గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని లక్నవరం క్రాస్ కిచెన్ షెడ్ లో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనిత రామచంద్రన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ లతో కలిసి అంగన్వాడి టీచర్లకు 5జి స్మార్ట్ ఫోన్ లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరచడానికి, డిజిటలైజేషన్ ప్రక్రియను సులభతరం చేయడానికి ప్రభుత్వం నూతన స్మార్ట్ ఫోన్లను అందిస్తుందని స్పష్టం చేశారు.

నూతన స్మార్ట్ ఫోన్ ద్వారా అంగన్వాడి టీచర్లు గర్భిణీలు, బాలింతలు, 0–6 సంవత్సరాల పిల్లల వివరాలను నమోదు చేసి వారి వివరాలను డిజిటల్ రికార్డులో భద్రపరచడం జరుగుతుందని, అంగన్వాడి కేంద్రానికి వచ్చే పిల్లలు మహిళలు రోజువారి హాజరు నమోదు చేయాలని, పిల్లల ఎత్తు, బరువు, పోషక ఆహారం పంపిణీ వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి డేటా అందించాలని అన్నారు. వీటి ద్వారా అంగన్వాడీ కేంద్రంలో పనితీరు ఒకే చోట నుంచి మానిటరింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న 5జి స్మార్ట్ ఫోన్ లను వినియోగిస్తూ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు అంగన్వాడి కేంద్రాల పనితీరును పిల్లలు, గర్భిణి స్త్రీలు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలు అందించే పౌష్టిక ఆహార వివరాలను ప్రభుత్వానికి నివేదికలను పంపించాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతుందని గ్రామాలలో ఉండే పిల్లలను అంగన్వాడి కేంద్రాలలో చేరే విధంగా చూడాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించి వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని, అంగన్‌వాడీ కేంద్రాలు సౌకర్యాల వసతులతో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తూ ప్రీ ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం విద్యను కూడా ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 545 టీచర్లకు 5+ స్మార్ట్ ఫోన్ లను అందించడం జరిగిందని, పోర్షన్ ట్రాకర్, ఎన్ హెచ్ టి ఎస్ మొబైల్ అప్లికేషన్లను 5జి స్మార్ట్ ఫోన్ల ద్వారా సులభతరం ఉపయోగించవచ్చని అన్నారు. అంగన్వాడి టీచర్లు సమయపాలన పాటిస్తూ పౌష్టిక ఆహారం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని విధినిర్వహణలో సమస్యలు తలెత్తితే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ అక్కేశ్వర్ రావు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ, స్థానిక సర్పంచ్ మేకల రాధా, డి డబ్ల్యు ఓ ప్రేమలత, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

## వార్డు సభల ద్వారా స్థానిక సమస్యల పరిష్కారం: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** ఏప్రిల్ 02, 2026– నిర్మల్:–వార్డు సభల నిర్వహణ ద్వారా వార్డులలో నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.

గురువారం ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్మల్ పట్టణంలోని బుధవార్ పేట్, మోచి గల్లి లో ఏర్పాటుచేసిన వార్డు సభలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు.

ఈ వార్డు సభ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజల సంక్షేమం కొరకు ఎన్నో పథకాలు అమలు పరుస్తుందని, ప్రజలంతా ఆ పథకాలను వినియోగించుకోవాలని అన్నారు. క్రమం తప్పకుండా నిర్ణీత వ్యవధిలోపు వార్డు సభలు ఏర్పాటు నిర్వహించి, స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలాన్ని అర్హులైన వారందరూ పొందాలని చెప్పారు.



గ్రామ సభలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని అధికారులు ప్రజలకు చదివి వినిపించారు. స్థానిక ప్రజలు వివిధ పథకాల రూపంలో పొందిన లబ్ధి వివరాలు చదివి వినిపించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజలంతా అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి భాగస్వామ్యం అవ్వాలని పిలుపునిచ్చారు.

అనంతరం, ఇటీవలి జిల్లాకు రెండు స్కోచ్ అవార్డులు లభించడానికి గాను విశిష్ట కృషి చేసిన కలెక్టర్ ను మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు శాలువాలతో సన్మానించి ,అభినందనలు తెలియజేశారు. ఈ వార్డు సభలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు అప్పాల కావ్య, గణేష్ చక్రవర్తి మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, స్థానిక ప్రజలు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు పకడ్బందీగా అమలు:జిల్లా కలెక్టర్ రాజర్షిషా

### గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే గ్రామసభ ముఖ్య ఉద్దేశం: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు




**ఆదిలాబాదు ప్రజాబలం ప్రతినిధి:** ఏప్రిల్ 2, 2026 ఆదిలాబాదు: జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం ప్రజాపాలన – ప్రగతి నివేదికలో భాగంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని రైతువేదిక లో నిర్వహించిన గ్రామసభ కు ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హజారయ్యారు.

ముందుగా కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి ప్రారంభించారు.

అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని ఎంపిడిఓ రామ్ ప్రసాద్, గ్రామ పంచాయతీ నివేదికను పంచాయతీ కార్యదర్శి శంకర్ గ్రామ సభలో చదివి వినిపించాగా, పలువురు సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు వారి అభిప్రాయాలను వెల్లడించారు.

ఈ సందర్భంగా గ్రామసభను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ గ్యారంటీ పథకాలతో పాటు, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్ని హాస్టళ్లు, స్కూళ్లలో డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం, వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ఉట్నూరు గ్రామ పంచాయతీలో మొదటి విడతగా సుమారు 66 ఇళ్లకు గాను 90 లక్షల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 16,000 ఇళ్లకు గాను సుమారు 220 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఐదేళ్లలో ఇళ్లు అందుతాయన్నారు.



ఖానాపూర్ నియోజకవర్గంలో కొత్తగా రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందని, అలాగే ఉట్నూరు ఐటిఐలో టాటా సంస్థ సహకారంతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభమైందని తెలిపారు. దీని ద్వారా 200 మంది యువతకు రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి ఆధునిక అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మహిళా సాధికారత కొరకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో ఉన్న తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు.

ఖానాపూర్ నియోజకవర్గ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు మాట్లాడుతూ,గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని అన్నారు. ముఖ్యంగా ఇంద్రమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా గెజిటెడ్ అధికారుల సమక్షంలో నిర్వహిస్తున్నామని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందేలా నాలుగు విడతల్లో ఈ పథకాన్ని అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి కోసం కొత్త బోరుబావుల మంజూరు వంటి అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే, వేసవి దృష్ట్యా విద్యుత్ వినియోగంపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారులు ఫోన్లకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఆదేశిస్తూ, అధికారుల సమన్వయంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

ఐటిడిఏ పిఓ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ, 2047 విజన్ తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. మనమందరం ఈ ప్రగతి పాలనలో భాగస్వాములం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఉట్నూర్ రైతువేదిక సమీపంలోని వెదురు తయారీదారుల ఇళ్లను సందర్శించి, వారి జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. మురికి కాలువ సమస్య తెలియజేయగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి మనోహర్, ఎంపీడీవో రామ్ ప్రసాద్, రైతులు, మహిళా సంఘాలు, గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు.

## పట్లూర్, ప్రజా పాలన గ్రామసభ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ పరుశురాం




**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 2 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామపంచాయతీ సమీపంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన కార్యక్రమము గ్రామ సర్పంచ్ పరుశురాం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి సంక్షేమ పథకాల గురించి గ్రామసభలో చర్చించడం జరిగింది గ్రామ సభలో ప్రభుత్వం నుండి వస్తున్న సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇల్లు ఉచిత కరెంటు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంగ్యాస్ సిలిండర్ రైతుబంధు రైతు బీమా సిసి రోడ్ల మంజూరు ఇలా ఒక్కొక్కటిగా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించడం జరిగిందని గ్రామ సర్పంచ్ పరుశు రాంతెలిపారు ,గ్రామసభ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరుశురాం, మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ కుమార్ యాదవ్, మాజీ ఎంపిటిసి మురంగపల్లి సురేష్, మాజీ ఎంపిటిసి నపారి రాజు, ఉప సర్పంచ్ అఖిల్, గ్రామపంచాయతీ పాలకవర్గ సేవకులు సభ్యులు, హెల్త్ డిపార్ట్మెంట్ ఆఫీసర్, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ సెక్రెటరీ గోపాల్,గ్రామ పెద్దలు మహిళా సోదరులు గ్రామ ప్రజలు ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసినట్టు తెలిపారు



## శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు: కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ఏసీపీ ల నుంచి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులను నిర్వహించకూడదని తెలిపారు. అనుమతులు లేకుండా ఎటువంటి సభలు సమావేశాలు,ర్యాలీలు నిర్వహించకూడదని సంబంధిత అధికారుల నుండి అనుమతులు తప్పనిసరి అని తెలిపారు అనుమతుల కోసం దరఖాస్తు చేయడం ద్వారా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అట్టి కార్యక్రమానికి తగిన విధంగా పోలీసు శాఖ భద్రతాపరమైన చర్యలు చేపడుతుంది అన్నారు. ఈ చట్టం అమలులో ఉండగా ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించకూడదు. రోడ్లు, ప్రజలకు ఉపయోగపడే ఇతర స్థలాల్లో జనాన్ని సమీకరించకూడదు. జన సంచారం మరియు అనుమతి పత్రాలలో పేర్కొన్నబడిన ప్రాంతాలలో మ్యూజిక్ లు, పాటలు, ప్రసంగాలు, రణగొణ ధ్వనులు చేయవద్దని కోరారు. ఈ ఉత్తర్వులు ఈనెల 30 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు.

## మీసేవ సర్వీసులకు తాత్కాలిక అంతరాయం

### వినియోగదారులు గమనించగలరు. జిల్లా కలెక్టర్ దివాకర టి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 2 ములుగు** ఏప్రిల్ 3 రాత్రి 10 గంటల నుంచి ఏప్రిల్ 5 ఉదయం 8 గంటల వరకు నిర్వహణ పనులు కొనసాగనున్నట్లు తెలిపారు. సర్వర్ పనితీరు మెరుగుదల, భద్రత వ్యవస్థల సాంకేతిక సమస్యల నివారణ కోసం ఈ నిర్వహణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో సంబంధిత విభాగాలకు చెందిన ఆన్లైన్ సేవలు డిజిటల్ లావాదేవీలు, వెబ్ పోర్టల్ సేవలు తాత్కాలికంగా పనిచేయవని, జిల్లా ప్రజలు అత్యవసర సేవలను ముందుగానే వినియోగించుకోవాలని సూచించారు.

నిర్వహణ పూర్తయిన అనంతరం సేవలు సాధారణ స్థితికి చేరుకుంటాయని తెలిపారు.

సాంకేతిక వ్యవస్థలను ఆధునీకరించడంలో భాగంగానే ఈ చర్యలు చేపడుతున్నామని, భవిష్యత్తులో వేగవంతమైన అంతరాయం లేని సేవలను అందించేందుకు ఈ నిర్వహణ ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన లో వెల్లడించారు.

## మంత్రి సీతక్క ను కలిసిన

### నాయీబ్రాహ్మణ సంఘం ప్రథినిధులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 2** ములుగు ఈరోజు ఉదయం ములుగు మండల కేంద్రంలో మంత్రి సీతక్కను కలిసిన నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు ములుగు జిల్లాలో నాయి బ్రాహ్మణ సంఘానికి సంబంధించిన కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో అలాగే ఏటూరు నగరం మండలాలలో కమ్యూనిటీ హాల్ లేకపోవడం వలన నాయి బ్రాహ్మణ సంఘాలకు చాలా ఇబ్బంది కలుగుతుందని ప్రభుత్వం నుంచి నాయి బ్రాహ్మణ సంఘాల కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించి నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ జిల్లా నాయకులతో వినతి పత్రం అందజేశారు

పంచాయతీరాజ్ మంత్రి సీతక్క స్పందిస్తూ జిల్లా కలెక్టర్ తో మాట్లాడి మీ సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు

కార్యక్రమంలో తెలంగాణ నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జంపాల రవీందర్, మండల అధ్యక్షులు వేల్పుకొండ శరబందం, ఉపాధ్యక్షులు ముత్యాల రాజు, మురహరి రామకృష్ణ, పట్టణ ఉపాధ్యక్షులు వేల్పుకొండ సతీష్, కార్యదర్శి మొగిళిచర్ల రమేష్, వేల్పకొండ దవేందర్, తదితరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి బి ఆర్ ఎస్,పార్టీ మర్పల్లి మండల అధ్యక్షులు

### రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ఆర్థిక సహాయం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 2(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్,గ్రామానికి చెందినపెద్దోళ్లరచ్చయ్యఆకస్మికంగా మరణించడం జరిగిందిఇట్టి విషయం టిఆర్ఎస్,పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న బి ఆర్ ఎస్,పార్టీ మర్పల్లి మండల అధ్యక్షులు రావులపల్లి శ్రీకాంత్ రెడ్డి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు

అంత్యక్రియల కొరకు మృత్యునీ కుటుంబానికి 5000/- రూపాయలు ఆర్థిక సహాయం పంపడంతో పట్లూర్ మాజీ సర్పంచ్ ఇందిర అశోక్,బి ఆర్ ఎస్,పార్టీ అధ్యక్షులు గొల్ల ముసలి అశోక్ మాజీ ఎంపీటీసీ రవి మరియు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మాజీ ఉప సర్పంచ్ బషీర్ రామకృష్ణ హరి సింగ్ సునీల్ యాదయ్య పాపయ్య నారాయణ మంగలి శ్రీన మల్లేశం రాజు పోచయ్య,లక్ష్మయ్య జోగిని గోపాల్ రాచయ్య తదితరులు మృత్యునీ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహకారం అందించారు

## ఈనెల 8న నాగర్ కర్నూలు లో ఉచిత కంటి

### చికిత్స శిబిరం...



**నాగర్ కర్నూలు జిల్లా ప్రజాబలం ప్రతినిధి** జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యం లో నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీ, రామకృష్ణ టాకీస్ రోడ్డు లో గల శోభ ఆప్టికల్ లో ఈనెల 8న బుధవారం నాడు ఉదయం 9గంటలకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ అప్తాలమిక్ ఆఫీసర్ బి.శివారెడ్డి తెలిపారు.ఈ శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పోరగల వారినీ ప్రత్యేక అంబులెన్స్ ద్వారా లయన్ రాంరెడ్డి కంటిఆసుపత్రి,ఎనుగొండ, మహబూబ్ నగర్ కి పంపించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనునట్లు తెలిపారు.రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా రక్తపరీక్షలు, సాధారణ పరీక్షలు, ప్రతిరోజు నిర్వహిస్తారని తెలిపారు.శిబిరానికి వచ్చే ముందు ఆధార్ కార్డు, ఓటర్ కార్డ్,లేదా రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు.మరిన్ని వివరాల కు 9440454284, 8106333324 నెంబర్ లలో సంప్రదించాలని కోరారు.

## పంచాయతీ వార్డు సభ్యునిగా సేవలందించిన

### ఎంజి . రెడ్డి కి ఘన సన్మానం...

రేణిగుంట గ్రామ పంచాయతీ వార్డు సభ్యునిగా సేవలందించిన ఎంజీ రెడ్డి పదవీ కాలం ఈరోజుతో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తించి గ్రామ ప్రజలు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంజి.రెడ్డి 567 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించడం గ్రామ చరిత్రలో ఒక విశేషంగా నిలిచింది. తన పదవీకాలంలో గ్రామాభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేయడం అందరికీ ఆదర్శంగా నిలిచింది.ఈ సందర్భంగా మాట్లాడిన గ్రామ ప్రముఖులు, ఆయన సేవలను కొనియాడుతూ భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం శాలువాతో మహేష్ బాబు, సూరిబాబు, ఫరీద్ బాబా, రఫీ, పునీత్ రెడ్డి, శ్రీకాంత్, బాలాజీ యాదవ్ తదితరులు సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం,

## తుమ్మలూరు గ్రామంలో నిర్వహించిన

### ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక గ్రామ సభకు హాజరైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



**రంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, ఏప్రిల్ 02 : ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక) కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామసభలు విజయవంతంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె.రామకృష్ణారావు రంగారెడ్డి జిల్లా మాహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.



ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ 2047 విజన్ తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది గౌరవ ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. మనమందరం ఈ ప్రగతి పాలనలో భాగస్వాములం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే గ్రామసభ ముఖ్య ఉద్దేశం అని సి.ఎస్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలతో పాటు, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.



అన్ని హాస్టళ్లు, స్కూళ్లలో డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం, వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని ఆయన అన్నారు. మహిళా సాధికారత కొరకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని సి.ఎస్ అన్నారు. కళ్యాణ్ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.


## సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతము తలపెట్టిన

## వి ఆర్ 4 సహాయోగ్ చారిటబుల్ ట్రస్ట్









**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 2 ఏప్రియల్ 2026**మణికొండ క్వార్టర్స్ పైప్ లైన్ రోడ్డులో గల శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ కమిటీ ద్వారా గురువారం పౌర్ణిమ రోజున రామ భక్త హనుమాన్ జన్మదిన వేడుకలు ఉదయం కన్నుల పండుగగా జరిగినవి, తదనంతరము వి ఆర్ 4 సహాయోగ్ చారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యములో మండువ మధుసూదన్ శర్మ పౌరహిత్యంలో ట్రస్టు ద్వారా ఎలాంటి రుసుం వసూలు చేయకుండా సంపూర్ణ పూజా సామాగ్రి సమకూరుస్తూ సామూహిక శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతం వినూత్న రీతిలో బ్రహ్మాండంగా నిర్వహించ బడినదని, ఇట్టి వ్రతములొ దరిదాపు శతజోడి పుణ్య దంపతులు మరియు వారి బందు మిత్ర హితులు సన్నిహితులు వ్రతములో పాల్గొనీ తీర్థ ప్రసాదములు స్వీకరించి, వీరాంజనేయ స్వామి దేవాలయ కమిటీ తరపున సేవలందించిన అన్నప్రసాద వితరణలో పాల్గొనడం జరిగినదనీ మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్ రావు తెలియ పరచారు. పూజలో పాల్గొన్న దంపతులు, ఆలయానికి విచ్చేసిన భక్త జనుల సమక్షములో వ్రతము జరుపుటకు సహయ సహకార లందించిన ఆలయ కమిటీ సభ్యులకు, బ్రహ్మోత్తములకు ట్రస్టు ద్వారా దుశ్శలవాలు కప్పి ఇతోచిత చిరు సత్కారం చేయడం జరిగినది. ఇట్టి శుభకర కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు దిలీప్ కక్కడ్, ధర్మపురి సుమనళిని, హరి హరనాథ్ రెడ్డి, మోహన్ కుమార్ పాణిగ్రహి, ఆలయ పూజారి విశ్వనాధ్ శర్మ కమిటీ సభ్యులు జొన్నాడ లక్ష్మయ్య, ధనేశ్వర్, కేశవచారి, పాండు, జ్ఞానేశ్వర్, సదానందం, మల్లేష్, శ్రీరాములు తది తరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం కావించినారు.

## సాఫ్ట్ టెన్నిస్ బాక్సింగ్ క్రీడాకారులకు

### నగదు ప్రోత్సాహం

మైలవరం, స్థానిక గొల్లపూడి లోని నారాయణ ఒలంపిడ్ స్కూల్ నందు 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు క్రీడలలో ప్రతిభ కనబరిచారు. తనిష్క్ అనే విద్యార్థి ఏపీ స్టేట్ సబ్ జూనియర్ ఇంటర్ డిస్టిక్ ఛాంపియన్ షిప్ లో బాలుర విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. మరొక విద్యార్థి ఎం జ్యోతి శివ స్మరణ్ ఏపీ స్టేట్ సబ్ జూనియర్ బాలికలు మరియు బాలుల బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో బాలుర విభాగంలో మూడవ స్థానంలో నిలిచి కౌశ్య పథకం సాధించారు. క్రీడాకారులు స్మరణ్ తనిష్కులను నారాయణ స్కూల్ క్లస్టర్ ప్రిన్సిపాల్ ఏ శివరామకృష్ణ,హై స్కూల్ కోఆర్డినేటర్ శశిధర్, ప్రిన్సిపాల్ మాధవి లత, అకాడమిక్ డీన్ జగదీశ్వరి, ఏవో వాసంతి, వారి చేతులు మీదుగా నగదు ప్రోత్సాహం అందించి విద్యార్థులను అభినందించారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడం విజయం సాధించటం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ మాధవి లత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కే నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ కు హాజరై ప్రభుత్వ పథకాల గురించి వివరించిన మంత్రి సీతక్క





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 2** గోవిందరావుపేట్ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామం లో ప్రజాపాలన ... ప్రగతి ప్రణాళిక గ్రామ సభ కు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, మహిళ శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనిత రామచంద్రన్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి హాజరు అయ్యారు.

ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన రెండు సంవత్సరాల మూడు నెలలలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు సాధించిన విజయాలు ప్రగతి అంశాల వీడియో సందేశాలను గ్రామస్తులకు స్క్రీన్ ల ద్వారా ప్రజలకు తెలియజేశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామాలలో సమస్యలను పరిష్కరించడానికి, గ్రామ అభివృద్ధి కోసం 99 రోజుల ప్రణాళిక ప్రగతిని కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు.గ్రామ పంచాయతీలలో నూతన పాలకవర్గం ఏర్పడిన తరువాత గ్రామాలలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు జరగాల్సిన కార్యక్రమాలకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వాటి అమలు, ప్రజలకు కావాల్సిన ప్రయోజనాలు, తలెత్తిన సమస్యల పరిష్కారానికి గ్రామ సభల ద్వారా ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొని తీర్మానాల ద్వారా గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు పోతాయని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని అర్హులైన వారు గ్రామసభల ద్వారా మళ్లీ దరఖాస్తు సమర్పించ వచ్చని స్పష్టం చేశారు ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటలలోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అమలు చేయడం జరిగిందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 5 లక్షల నుంచి 10 లక్షల పెంపొందించడం జరిగిందని, పేదవారు కడుపునిండా భోజనం చేయాలనే ఉద్దేశం తో సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ వ్యాపార రంగాలలో స్థిరమైన ఆర్థిక సాధించే విధంగా ప్రోత్సహించడం జరుగుతుంది పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లో స్థానిక సర్పంచ్ అధికారుల ఆధ్వర్యంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ చల్వాయి గ్రామంలో కొత్త రేషన్ కార్డులు అందించడం జరిగిందని,73 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్య ఇస్తూ మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించబడిందని, ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా10 వేల కోట్ల రూపాయల ఖర్చు మహిళ లకు ఆదా అవుతుందని అన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను, సాధించిన ప్రగతిని వివరాలను ప్రజలకు తెలియజేశారు.

మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా శక్తి ఐకెపి సెంటర్ల ద్వారా తోడ్పాటు అందించడం జరుగుతున్నాయని, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా,రైతు బీమా పథకాల అమలు చేస్తున్నామని తెలిపారు.500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం రాబోయే కాలంలో పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరా బీమా పథకం అనే నూతన పథకాలను ప్రవేశపెట్టబోతున్నట్లు తెలిపారు.అనంతరం తాడ్వాయి మండలానికి చెందిన 21 కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.తో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, రాష్ట్ర పంచాయతీ రాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, సర్పంచ్ మేకల రాధ, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, డి పి ఓ వెంకయ్య, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఫ్‌హెచ్‌ఈలో ఘనంగా ప్రారంభమైన త్రిథి--26



**హైదరాబాద్, ఏప్రిల్ 2, 2026:(ప్రజాబలం ప్రతినిధి)** ఐసిఎఫ్ఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఐఎఫ్‌హెచ్‌ఈ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక మూడు రోజుల అండర్‌గ్రాడ్యుయేట్ సాంస్కృతిక ఉత్సవం 'త్రిథి--26' ఏప్రిల్ 2, 2026న విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమైంది. ఏప్రిల్ 4, 2026 వరకు కొనసాగనున్న ఈ ఉత్సవంలో వివిధ విభాగాల విద్యార్థులు తమ ప్రతిభ, సృజనాత్మకతను ప్రదర్శించనున్నారు.

ప్రారంభోత్సవ కార్యక్రమం ఉదయం 10:30 గంటలకు సాంప్రదాయ దీపప్రజ్వలనంతో ప్రారంభమైంది. అనంతరం నిర్వహించిన శాస్త్రీయ స్వాగత నృత్య ప్రదర్శన కార్యక్రమానికి సాంస్కృతిక వైభవాన్ని తీసుకువచ్చింది. ఈ ప్రారంభ వేడుకకు ఐఎఫ్‌హెచ్‌ఈకి చెందిన అన్ని డైరెక్టర్లు హాజరై విద్యార్థులకు తమ మద్దతు తెలిపారు.

త్రిథి--2026 కన్వీనర్ మరియు ఐసిఎఫ్ఐ లా స్కూల్ అసిస్టెంట్ డీన్ (స్టూడెంట్ యాక్టివిటీస్) డా. ఏ. అరుణ్ కుమార్ స్వాగత ప్రసంగం చేశారు. ఆయన తన ప్రసంగంలో సమగ్ర విద్య ప్రాముఖ్యతను వివరించి, త్రిథి వంటి సాంస్కృతిక వేదికలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, జట్టు భావనలను అభివృద్ధి చేస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులకు హృదయపూర్వక స్వాగతం పలికారు.

ఐఎఫ్‌హెచ్‌ఈ వైస్ చాన్సలర్ ప్రొఫ్. (డా.) టమ్మా కోటి రెడ్డి అధ్యక్ష ప్రసంగం చేసి, విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమగ్ర అభివృద్ధిని సాధించాలని సూచించారు.

ఐఎఫ్‌హెచ్‌ఈ రిజిస్ట్రార్ ప్రొఫ్. ఎస్. విజయలక్ష్మి కూడా ప్రసంగిస్తూ, నిర్వహణ బృందం కృషిని అభినందించారు. త్రిథి వంటి ఉత్సవాలు సంస్థలో ఐక్యతను పెంపొందించి, సజీవమైన క్యాంపస్ సంస్కృతిని అభివృద్ధి చేస్తాయని పేర్కొన్నారు.




విద్యార్థులు ఈ వేదికను తమ ప్రతిభను వెలికితీయడానికి వినియోగించుకోవాలని ప్రోత్సహించారు.

ఐసిఎఫ్ఐ లా స్కూల్ డైరెక్టర్ ప్రొఫ్. డా. రవి శేఖర్ రాజు మాట్లాడుతూ, న్యాయ విద్య తరగతి గదులు, న్యాయస్థానాలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యత గల, నైతిక విలువలు కలిగిన నిపుణులను తయారు చేయాలని అన్నారు. త్రిథి వంటి సాంస్కృతిక ఉత్సవాలు విద్యార్థుల్లో నాయకత్వం, జట్టు పని, సృజనాత్మకత, భావోద్వేగ మేధస్సు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

ఐసిఎఫ్ఐ సొసైటీ చైర్‌పర్సన్ శ్రీమతి శోభా రాణి యాసస్వి గౌరవ అతిథిగా హాజరై, యువతలో నాయకత్వం మరియు ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో సాంస్కృతిక కార్యక్రమాల పాత్రను వివరించారు.

అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా డైరెక్టర్ శ్రీమతి అమల అక్కినేని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. తమ అభిరుచులను నిబద్ధతతో అనుసరించాలని, సృజనాత్మకత, సామాజిక బాధ్యత, నిరంతర అభ్యాసం ఎంతో ముఖ్యమని విద్యార్థులకు సూచించారు.

తన ప్రసంగంలో 'బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్' సంస్థతో తన దీర్ఘకాల అనుబంధాన్ని ప్రస్తావించారు. జంతు సంక్షేమం, రక్షణ చర్యలు, స్టెరిలైజేషన్ కార్యక్రమాలు, క్రూరత్వ నిరోధం, మానవతా పరిరక్షణ కార్యక్రమాల గురించి వివరించారు. జంతువుల పట్ల కరుణ చూపడం సమాజ నైతిక బలాన్ని ప్రతిబింబిస్తుందని, విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో అతిథులను సన్మానించారు. త్రిథి--2026 ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డా. గౌరీ బి. చనాల్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది.

త్రిథి--26 మూడు రోజుల పాటు సాంస్కృతిక ప్రదర్శనలు, పోటీలు, పరస్పర కార్యక్రమాలతో విద్యార్థులకు ఉత్సాహభరిత వేదికగా నిలవనుంది.

డా. ఏ. అరుణ్ కుమార్
కన్వీనర్ -- త్రిథి 2026
ఐసిఎఫ్ఐ లా స్కూల్, ఐఎఫ్‌హెచ్‌ఈ, హైదరాబాద్

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ని కలిసిన రితేష్ రెడ్డి

పోరుమామిళ్ల ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని ఒంటిమిట్ట టీటీడీ గెస్ట్ హౌస్‌లో బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ కే. రితేష్ రెడ్డి కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. బద్వేల్ నియోజకవర్గ ప్రజలందరిపై ఆ కోదండరాముని ఆశీస్సులు, ముఖ్యమంత్రి అండదండలు ఎల్లప్పుడూ ఉండాలని రితేష్ రెడ్డి ఈ సందర్భంగా మనసారా కోరుకున్నారు.

## ఖమ్మం పట్టణములు కతోలిక సంఘం ఆధ్వర్యంలో భారీ సిలువ పాటుల ప్రదర్శన.



**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 02 (ప్రజాబలం)** ఖమ్మం గుడ్ ఫ్రైడే సందర్భంగా ఖమ్మం నాయుడుపేట బిషప్ హౌస్ లో కార్యక్రమాన్ని ప్రెస్ మీట్ లో కతోలిక బిషప్ శ్రీశ్రీశ్రీ సగిలి ప్రకాష్ మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సమాధానము కలగాలని తన త్యాగము ద్వారా శాంతి కరుణ ద్వారా దైవత్వాన్ని మానవ తత్వముగా మార్చుకొని మానవుల రక్షణ కోసము బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం తపించి వారికి అనేక దేవుని దీవెనలు ఆశీర్వాదాలు పంచడానికి వచ్చి ఈ లోకం చే తిరస్కరించబడి చివరికి మానవాళి రక్షణ కోసం సిలువను మోసిన ఏసుప్రభు శిలువ పాటుల మరణాన్ని సాదృశ్యంగా తీసుకుని, ప్రపంచవ్యాప్తంగా గుడ్ ఫ్రైడే అనగా మానవాళి రక్షణ కోసం ఒక దైవ కుమారు మరణించిన విధానాన్ని కొనియాడుతూ ఖమ్మం పట్టణములు పాత బస్టాండ్ దగ్గరలో గల చర్చి వద్ద నుండి జెడ్పీ సెంటర్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా కొత్త బస్టాండ్ మీదుగా కరుణగిరి వరకు ఈ యొక్క ఏసు పాటులను ప్రార్థిస్తూ అనేక వేల మందితో పెద్ద ఎత్తున ప్రదర్శన ఉంటుందని వారు ఈ సందర్భంగా వివరించారు కావున క్రమశిక్షణాయతముతో ప్రార్థన పరంగా జరిగే కార్యక్రమం కు, ప్రజలు, ప్రభుత్వ యంత్రాంగము పోలీసు యంత్రాంగము సహకరించాలని, క్రైస్తవులు చేసే ఈ యొక్క ప్రార్థనలు మానవాళి రక్షణ కోసమే అని వారు తెలియపరిచినారు. వీరితోపాటు మీడియా ఇంచార్జ్ ఫాదర్ గోవా శౌరయ్య ,ఫైనాన్స్ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఐజాక్ ,జాన్ మజ్ను చర్చి విచారణ గురువులు ఫాదర్ సురేష్ గిరి ప్రసాద్ నగర్ చర్చి విచారణ గురువులు ఫాదర్ జేసు రాజు బిషప్ సెక్రెటరీ ఫాదర్ విజయ్ సంఘస్తులు పాల్గొన్నారు

## దార్లపల్లి ప్రజా పాలనలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్ రాజు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 2 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం దార్లపల్లి గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పాలన సభ నిర్వహించడం జరిగింది సభ అధ్యక్షత గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాలరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ఒక్కొక్కటిగా చర్చించి నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని అదే విధంగా ఒక్కొక్కటిగా ప్రజల ముందుకు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ సభ నిర్వహించడం జరిగిందని గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాలరాజు తెలిపారు గ్రామఅభివృద్ధి విషయంలో చర్చించినట్టు అయితే ఉచిత బస్సు సౌకర్యం ఉచిత విద్యుత్ సౌకర్యం గ్యాస్ సిలిండర్ సబ్సిడీ షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ రైతు బందు ఇలా ఒక్కొక్కటిగా అన్ని కార్యక్రమాలు నిరంతరం జరిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు గ్రామాల్లో అండర్ డ్రైనేజీలు సిసి రోడ్లు మంచినీటి సౌకర్యం వీధిలైట్లు ఇలా ఒక్కొక్కటిగా గ్రామ అభివృద్ధిలో భాగంగా కృషి చేస్తున్నట్టు




తెలిపారు గ్రామంలో స్థానికంగా పనిచేస్తున్న అన్ని చస్తానిక సంస్థలతో గ్రామ అభివృద్ధి గురించి పెద్దలతో కలిసి అన్ని విషయాలు చర్చించి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు దృష్టిలో పెట్టుకొని గ్రామాభివృద్ధి చేసేందుకు ఎల్లవేళలా కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాలరాజు తెలిపారు ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్రాజ్, ఉపసర్పంచ్ కులుసుశీ బి, టి ఏ భాస్కర్,వార్డు పాలకవర్గ సభ్యులు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు యువకులు ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసినట్టు తెలిపారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com